PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 93 | విజయవాడ, మంగళవారం 4 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 4 November 2025 | Rs

రూ.18 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కైంకర్యం

- అధికార పార్టీ ముఖ్యనేత అండతో అమ్మకం!
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

3



మహిళా క్రికెటర్లపై కనకవర్షం

ఐసిసి రూ.39.80కోట్లు, బిసిసిఐ రూ.51కోట్లు నజరానా

8

మృత్యుఘోష

ఆర్‌టిసి బస్సును ఢీకొట్టిన టిప్పర్

19 మంది మృతి, 24 మందికి తీవ్ర గాయాలు

- డ్రైవర్ క్యాబిన్ నుండి 5 సీట్ల వరకూ చీల్చుకుంటూ పల్టీ
- ప్రధాని, తెలుగు రాష్ట్రాల సిఎంల తీవ్ర దిగ్భ్రాంతి
- తెలంగాణ రాష్ట్రం చేవెళ్ల సమీపంలో దారుణం
- మృతుల కుటుంబాలకు రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా : తెలంగాణ మంత్రి పొన్నం

బస్సులోకి చొచ్చుకెళ్లిన టిప్పర్





ప్రయాణికుల మృతదేహాలు



రోదిస్తున్న బంధువులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మాటలకందని మహా విషాదం... కాలేజీకి కొందరు... దవాఖానకు మరికొందరు... వ్యక్తిగత పనుల మీద ఇంకొందరు... తాండూరు నుంచి తెల్లవారుజామునే హైదరాబాద్‌కు బయల్దేరారు. బస్సు చేవెళ్ల సమీపంలోకి రాగానే కంకర లోడుతో అతివేగంగా వస్తున్న టిప్పర్ మృత్యువు రూపంలో వారిని కబళించింది. ఈ ప్రమాదంలో బస్సు, లారీ డ్రైవర్లతో సహా 19 మంది దుర్మరణం పాలయ్యారు. 24 మందికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో ఇరుక్కున్న వారిని పోలీసులు అతికష్టంమీద బయటకు తీసి చేవెళ్ల, వికారాబాద్ ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘోర ప్రమాదం పట్ల ప్రధాని, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తాండూర్ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు సోమవారం తెల్లవారు జామున 4.30 గంటలకు తాండూరు నుంచి హైదరాబాద్ బయల్దేరింది. 6.30 గంటల సమయంలో చేవెళ్ల మండలం ఖానాపూర్ రెవెన్యూ పరిధిలోని ఇంద్రారెడ్డి నగర్ దాటగానే షాద్ నగర్ నుంచి వికారాబాద్ జిల్లా చిట్టెంపల్లికి కంకర లోడుతో ఎదురుగా మిగతా 2లో

మృతులు వీరే...

హైదరాబాద్

బోరబండ వాసులు

1. కల్పన (45)
2. గోగుల గున్నమ్మ (60)

వికారాబాద్ జిల్లా...

1. తారీఫ్ బాయ్ (44), దాన్నారం
2. గుర్రాల అఖిల (22), లక్ష్మీనారాయణపూర్, యాలాల మండలం
3. ఎం.హనుమంత్ (44), నిట్టూర్, దౌల్తాబాద్ మండలం
4. దస్తగిరిబాబా (37), బస్సు డ్రైవర్, మంతటి గ్రామం, బషీరాబాద్ మండలం
5. లక్ష్మి, హాజీపూర్ గ్రామం, యలాల్ మండలం
6. కుడుగుంట బందెప్ప (42), హాజీపూర్ గ్రామం, యాలాల్ మండలం

తాండూరు మండలం...

1. ఈడికి తనూష (20)
2. నందిని (22),
3. ఎమ్‌డి ఖలీద్ (43)
4. ముస్కాన్ బేగం (48)
5. ఈడికి సాయిప్రియ (18)
6. సెలెహా బేగం
7. జహీరా ఫాతిమా, (40 రోజుల సెలెహా కూతురు)
8. తబసుమ, ముషధ దర్గా
9. కిష్టాపూర్ వెంకటమ్మ (21), వాల్మీకి నగర్

మహారాష్ట్ర, కర్ణాటక

1. ఆకాష్ కామేలి (24), మహారాష్ట్ర, టిప్పర్ డ్రైవర్
2. బచ్చన్ నాగమణి (55), గుల్బార్గా, కర్ణాటక

ప్రాణ నష్టం బాధాకరం : ప్రధాని మోడీ

ప్రాణ నష్టం చాలా బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. మరణించిన ప్రతిఒక్కరి కుటుంబానికి పిఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని తెలిపారు.

ఘటన కలిచివేసింది : తెలంగాణ సిఎం

ఈ ఘటన తనను కలిచి వేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం తరపున తగిన పరిహారంతో పాటు.. సాయం అందించే అన్ని చర్యలు చేపటాలని మంత్రులు, అధికారులను ఆదేశించారు.

చంద్రబాబు సంతాపం

ఈ ఘటనపై సిఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన వార్త తనను కలిచివేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించారు.

ముగ్గురు అక్కాచెల్లెళ్లు దుర్మరణం



బస్సు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు మరణించారు. తాండూరుకు చెందిన ఎల్లయ్య గౌడ్‌కు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తెకు ఇటీవలే వివాహమైంది. ముగ్గురు కుమార్తెలు నందిని (డిగ్రీ ఫస్టియర్), సాయిప్రియ (డిగ్రీ థర్డ్ ఇయర్), తనూష (ఎంబిఎ) హైదరాబాద్‌లో చదువుతున్నారు. ఇటీవల బంధువుల పెళ్లి ఉండడంతో వీరు ముగ్గురూ సొంతూరుకు వెళ్లారు. వీరికి కోఠి ఉమెన్స్ కాలేజీలో పరీక్షలు ఉండడంతో హైదరాబాద్ బయలుదేరారు. వీరిని తాండూర్‌లో ఎల్లయ్యగౌడ్ బస్సు ఎక్కించారు. ప్రమాదంలో ముగ్గురు చనిపోవడంతో ఆయన గుండెలు పగిలేలా విలపించారు.

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సిపిఎం 2

రూ.3 వేల కోట్లకుపైగా కుంభకోణం

- 'డిజిటల్ అరెస్టు'లపై కఠిన ఆదేశాలిస్తాం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : డిజిటల్ అరెస్టులు ఓ కుంభకోణం స్థాయికి చేరుకున్నాయని, ఇప్పటివరకు భారత్‌లోనే రూ.3వేల కోట్లకు పైగా మొత్తాలను బాధితుల నుండి మోసగాళ్లు కొల్లగొట్టారని సుప్రీంకోర్టు పేర్కొంది. అది కూడా మెజారిటీ సంఖ్యలో వృద్ధులను లక్ష్యంగా చేసుకునే ఇదంతా జరిగిందని, వీటిని అరికట్టే సంస్థల బలోపేతానికి కఠినమైన ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం అందజేసిన విశ్వసనీయమైన నివేదికను ప్రస్తావిస్తూ, జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ అరెస్టులనేది చాలా పెద్ద సవాలుగా మారిందని ఈ నివేదికను చూస్తుంటే అర్థమవుతోందని జస్టిస్ కాంత్ వ్యాఖ్యానించారు. మనం అనుకుంటున్న దానికంటే చాలా ఎక్కువగా ఈ సమస్య పాతుకుపోయిందని పేర్కొన్నారు. మోసం జరుగుతున్న తీరు, పరిధి చాలా విస్తృతంగా వుందని నివేదికను చూస్తే తెలుస్తోందన్నారు. ఒక్క భారతదేశంలోనే రూ.3వేల కోట్లకు పైగా మొత్తాలను బాధితుల నుండి వసూలు చేశారంటే ఇక అంతర్జాతీయ స్థాయిలో ఎలా వుంటుందో ఆలోచించుకోవచ్చన్నారు. ఊహించిన దానికన్నా మించి డిజిటల్ అరెస్టు కుంభకోణం స్థాయి వుందని జస్టిస్ కాంత్ వ్యాఖ్యలతో కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఏకీభవించారు. ఇటువంటి మోసగాళ్లకు వ్యతిరేకంగా వ్యవహరించే సంస్థలను మరింత బలోపేతం చేసేందుకు న్యాయ వ్యవస్థ చాలా కఠినమైన ఆదేశాలు జారీ చేస్తుందని, ఇందుకు అందరి మద్దతు కావాలని జస్టిస్ కాంత్ చెప్పారు. మనీ లాండరింగ్ ముఠాలే ఈ సైబర్ నేరాలకు పాల్పడుతున్నాయని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి అన్నారు. కోర్టు, దర్యాప్తు సంస్థల ఫోర్జరీ ఉత్తర్వులను సాకుగా చూపి హర్యానాలోని అంబాలాలో ఒక వృద్ధ జంటను డిజిటల్ అరెస్టు చేసి రూ.1.05 కోట్లకు పైగా కొల్లగొట్టిన ఘటనను సుప్రీంకోర్టు తనకు తానుగా పరిగణనలోకి తీసుకుంది. దేశవ్యాప్తంగా ఇలాంటివి అనేక కేసులున్నాయని న్యాయస్థానానికి తెలియజేస్తూ కేంద్రం ఒక నివేదిక సమర్పించింది. ఈ సమస్య కలిగించే ప్రభావం చాలా ఎక్కువ అని, ఇందులో ఆర్థిక కోణమే కాదని, మానవీయ కోణం కూడా వుందని మెహతా పేర్కొన్నారు. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం చేసి వారిని బానిసలుగా మారుస్తున్నారన్నారు.

ఆభరణాల ఎగుమతులకు ట్రంప్ దెబ్బ

- 70 శాతం పైగా పతనం

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్‌పై విధించిన అధిక టారిఫ్‌లు దేశ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ఆభరణాలు, రత్నాల ఎగుమతులు భారీగా దెబ్బతిన్నాయి. భారత ఆభరణాలు, రత్నాలపై ట్రంప్ విధించిన 50 శాతం టారిఫ్‌లతో గడిచిన సెప్టెంబర్‌లో విలువైన రత్నాలు, ముత్యాలు, విలువైన రంగురాళ్ల ఎగుమతులు 76.7 శాతం క్షీణించాయి. బంగారం, ఇతర విలువైన లోహాల ఆభరణాల ఎగుమతులు 71.1 శాతం పడిపోయాయి. ఈ ఏడాది మే-సెప్టెంబర్ కాలంలో 58 శాతం క్షీణించి 202..8 మిలియన్లకు పతనమయ్యాయి. గతేడాది ఇదే కాలంలో వీటి ఎగుమ తులు 500.2 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ట్రంప్ అధిక సుంకాల కారణంగా యుఎస్ కొనుగోలు దారులు ఇప్పుడు థాయ్‌లాండ్, వియత్నాం, చైనా వంటి ఇతర దేశాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ దేశాలు 20-30 శాతం మధ్య తక్కువ సుంకాలను కలిగి ఉన్నాయి. భారత్‌లో రత్నాలు, ఆభరణాల రంగం లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోంది. వీటి ఎగుమతుల క్షీణతతో ఈ రంగంలోని ఉద్యోగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో రత్నాలు, అభరణాల రంగాలను ఆదుకోవడానికి తమకు వడ్డీ రాయితీలు, అత్యవసర రుణాలివ్వాలని జిజెఇపిసి కేంద్రాన్ని కోరుతోంది.

రాష్ట్రంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు

- సిఎం లండన్ పర్యటనలో హిందూజాతో ఒప్పందం



లండన్‌లో బహుళజాతి సంస్థల ప్రతినిధులతో చర్చిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దశలవారీగా ఎపిలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు హిందూజా గ్రూపు ముందుకు వచ్చింది. వెంటనే ప్రభుత్వంతో ఎంఒయు కూడా కుదుర్చుకుంది. ఈనెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే సిఐఐ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు లండన్‌లో పర్యటిస్తున్నారు. పలువురు పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా తొలిరోజు హిందూజా గ్రూపు ఛైర్మన్ అశోక్ హిందూజా, ఆ సంస్థ యూరప్ ఛైర్మన్ ప్రకాశ్ హిందూజాలతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. ఈభేటీలో రూ.20 వేల కోట్ల పెట్టుబడుల పెట్టేందుకు ప్రభుత్వంతో హిందూజా గ్రూపు అక్కడికక్కడే ఎంఒయు కుదుర్చుకుంది. విశాఖలో హిందూజా సంస్థకు ప్రస్తుతం ఉన్న 1050 మెగావాట్ల థర్మల్ ప్లాంట్లుకు అదనంగా మరో 1600 మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించనుంది. ఒక్కొక్కటీ 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు కొత్త యూనిట్లను స్థాపిస్తోంది. అలాగే రాయలసీమలో భారీ సౌర, పవన్ విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తోంది. మరోవైపు ఆధునిక ఎలక్ట్రిక్ బస్సులు, లైట్ కమర్షియల్ వాహనాల తయారీ లక్ష్యంగా కృష్ణాజిల్లా మల్లవల్లిలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్ నెలకొల్పనుంది. వీటితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇవి ఛార్జింగ్ నెట్‌వర్కు తీసుకువస్తుంది. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ ఎలక్ట్రిక్ మొబిలిటీ హబ్‌గా తీర్చిదిద్దడంలో హిందూజా గ్రూప్ పెట్టుబడులకు కీలకం అవుతాయని ఈ సందర్భంగా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే పలువురు పారిశ్రామిక వేత్తలతోనూ చర్చించారు. పరిశ్రమలు స్థాపించడంతోపాటు జిసిసిలు ఏర్పాటు చేయాలని వారిని కోరారు. ఉపాధి కల్పించడంతోపాటు రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టేలా ముందుకు రావాలని, దీనికోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సిఎం వారికి వివరించారు. గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్లు, ఏవియేషన్ వంటి రంగాల్లో పెట్టుబడుల అంశంపై భేటీల్లో ప్రస్తావించారు. ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిట్జ్‌గ్రాల్డ్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. లండన్‌లో అతిపెద్ద విద్యుత్ సరఫరాదారు సంస్థగా ఆక్టోపస్ ఇంటర్నేషనల్ సంస్థకు పేరుంది. అమరావతి, విశాఖలో కొత్త టెక్నాలజీ ద్వారా విద్యుత్ సరఫరా, నియంత్రణ రంగంలో పనిచేసేందుకు అవకాశాలు ఉన్నాయని సిఎం వివరించారు. క్లీన్ ఎనర్జీ, స్మార్ట్‌గ్రిడ్, డేటా అనలిటిక్స్ రంగాల్లో ఎపిలో అవకాశాలు ఉన్నాయని ఆక్టోపస్ ఎనర్జీ ప్రతినిధులకు సిఎం వివరించారు. 160 గిగావాట్ల మిగతా 2లో

ఆ గ్రామాలను బుగ్గి చేస్తారా?

- పచ్చని పొలాల్లో ఆయుధ డిపో వద్దు
- గ్రామసభ వద్దని తీర్మానించాక, కేబినెట్‌లో తీర్మానించినా చెల్లదు
- బాధిత గ్రామాల్లో పర్యటించిన వామపక్ష నేతలు



బాధితులతో మాట్లాడుతున్న వి. శ్రీనివాసరావు, వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

పచ్చని పంట పొలాల్లో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయొద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ కేంద్ర కమిటీ సభ్యులు అక్కినేని వనజ, ఇతర వామపక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదు గ్రామాల ప్రజల జీవితాలను బుగ్గిపాలు చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఆయుధ డిపో వద్దని గ్రామసభలో తీర్మానించాక, కేబినెట్‌లో తీర్మానించినా చెల్లదన్నారు. గిరిజనులకు వామపక్షాలు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని వంకావారిగూడెం, దాట్లవారిగూడెం, రమణక్కపేట, మడకంవారిగూడెం, కొత్తసీమలవారిగూడెం గ్రామాల పరిధిలోని 1,166 ఎకరాల్లో నేవీ ఆయధ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తమ గ్రామాల్లో దీనిని ఏర్పాటు చేయవద్దంటూ గ్రామసభలో అక్కడి గిరిజనులు మూడుసార్లు ఏకగ్రీవ తీర్మానం చేసినా ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో వారికి అండగా సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్), సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, ఎస్‌యుసిఐ రాష్ట్ర నేతలు బాధిత గ్రామాల్లో సోమవారం పర్యటించారు. మడకంవారిగూడెం చేరుకున్న వారికి గిరిజనులు పూలమాలలు వేసి, పూలు చల్లి ఘనస్వాగతం పలికారు. అనంతరం 'పంటలు పండే భూముల్లో ఆయుధ డిపో వద్దు, గిరిజనుల పొట్టకొట్టొద్దు' అంటూ నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆయుధ డిపో నిర్మాణంతో ఖాళీ కానున్న కొత్తసీమలవారిగూడెం గ్రామాన్ని సందర్శించి అక్కడి గిరిజనులతో మిగతా 7లో



ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌గా బొజ్జిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ (ఎస్‌టి) ఛైర్మన్, మెంబర్లను నియమించింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 155ను సోమవారం విడుదల చేసింది. కమిషన్ ఛైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన పోల్ల బొజ్జిరెడ్డిని నియమించారు. సభ్యులుగా గొర్లె సునీత (రంపచోడవరం ఎస్‌టి), కద్రక మల్లేశ్వరరావు (కురుపాం), కాకిలక్ష్మి (రంపచోడవరం), సాయిరాం కిల్లో (అరకు వ్యాలీ) పి వెంకటప్ప (గుంతకల్లు) నియమించారు. వీరందరూ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు.

ఇక్కడకు వచ్చి మాట్లాడండి

బీహారీలపై దాడులన్న మోడీ వ్యాఖ్యలపై స్టాలిన్ సవాల్

ధర్మపురి : బీహార్‌లో ఇటీవల ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ తమిళనాడుకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ రాష్ట్రానికి వచ్చి ఆ వ్యాఖ్యలు చేయాలని ఆయన ప్రధానికి సవాలు విసిరారు. కష్టపడి పనిచేసే బీహారీలపై తమిళనాడులో దాడులు జరుగుతున్నాయని, వారిని డిఎంకె వేధిస్తున్నారని మోడీ బీహార్ ఎన్నికల ప్రచారంలో ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై స్టాలిన్ స్పందిస్తూ... "రాష్ట్రంలో వలస కార్మికులను లక్ష్యంగా చేసుకుని సాగిన హింసాత్మక సంఘటనలు అంటూ ఏమీ లేవు. ఇక్కడకు వచ్చిన వారి పట్ల సోదరభావం పెంపొందించుకునే రాష్ట్రం ఇది. అయినా మోడీ తాను అన్ని రాష్ట్రాలకూ ప్రధానినన్న విషయం మరిచిపోయినట్లున్నారు. బీహార్‌లో అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. కావాలంటే ఆయన ఇక్కడకు వచ్చి అదే ప్రసంగం చేయమనండి." అని పేర్కొన్నారు. తమిళనాడులో ఎలాగైనా పాదం మోపాలని బిజెపి చాలా గట్టిగా ప్రయత్నాలు చేస్తోందని, అది జరగకపోవడం వల్ల కలిగే నిరాశా నిస్పృహలన్నీ మోడీ విద్వేష ప్రచారంలో స్పష్టంగా కనిపిస్తున్నాయని స్టాలిన్ విమర్శించారు. నా సోదరుడు, విసికె నేత తిరుమవలన్ చెప్పినట్లుగా 2026లో కూడా డిఎంకెనే అధికారంలోకి వస్తుందని తాను ప్రగాఢంగా భావిస్తున్నానని చెప్పారు. 2021 అసెంబ్లీ ఎన్నికలు అన్నాడిఎంకె బానిసత్వం నుండి రాష్ట్రాన్ని కాపాడితే, 2026 ఎన్నికలు అన్నాడిఎంకె - బిజెపి కూటమి నుండి రాష్ట్రాన్ని కాపాడాల్సిన అవసరం వుందని చెప్పారు.

బిజెపి భయంతో ఎస్‌ఐఆర్‌పై అన్నాడిఎంకె నోరుమెదపడం లేదు

ఎస్‌ఐఆర్‌పై అన్నాడిఎంకె నేత పళనిస్వామి ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని స్టాలిన్ విమర్శించారు. బిజెపి భయంతోనే వారు దీనిపై మాట్లాడడం లేదన్నారు. అందుకనే తాము ఎస్‌ఐఆర్‌పై ఆదివారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి కూడా రాలేదన్నారు. ధర్మపురి ఎంపి ఎ.మణి కుమారుడి వివాహ సమయంలో స్టాలిన్ ప్రసంగించారు. అఖిలపక్షానికి రాకపోయినా తన అభ్యంతరాలను పళనిస్వామి ఇసికి పంపినందుకు కృతజ్ఞతలని అన్నారు. ఎస్‌ఐఆర్ సమయంలో అక్కడే వుండాల్సిందిగా కార్యకర్తలను కోరుతూ ఒక ప్రకటన జారీ చేశారని, దీన్నిబట్టి ఆయన ద్వంద్వ మనస్తత్వం బయపడుతోందని స్టాలిన్ విమర్శించారు.

ఉద్యోగాల పేరుతో మాజీ మంత్రి రజిని మోసం

- ఆమె వ్యక్తిగత పిఎలపై గ్రీవెన్స్‌లో బాధితుని ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశారని మాజీ మంత్రి విడదల రజిని, ఆమె వ్యక్తిగత సహాయకులు శ్రీకాంత్, రామకృష్ణ, మరికొందరిపై ప్రకాశం జిల్లా దోర్నాలకు చెందిన ఫార్మసీ విద్యార్థి మోహనకృష్ణ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో బాధితుడు మాట్లాడుతూ.. దోర్నాలకు చెందిన ఒక వ్యక్తి ద్వారా పరిచయమైన శ్రీ గణేష్, కుమారస్వామి ద్వారా అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగం కోసం రజిని అనుచరులకు విడతల వారీగా రూ.ఎనిమిది లక్షలు ఇచ్చానని, ఇదే విధంగా తనకు తెలిసిన మరో 15 మంది మోసపోయారని చెప్పారు. శ్రీకాంత్, రామకృష్ణకు నగదు ఇచ్చిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వారితో అందుబాటులో ఉండాలని సూచించారన్నారు. బాధితునితోపాటు వచ్చిన చిలకలూరిపేట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైసిపి నాయకుడైన చిన్న మాట్లాడుతూ... రజిని మంత్రిగా ఉన్న సమయంలో వైద్యారోగ్య శాఖలో ఒక్కో ఉద్యోగానికి ఒక్కో ధర నిర్ణయించి తమ అనుచరులతో వసూళ్లు చేయించారని, ఉద్యోగాలు ఇప్పించకపోగా, డబ్బులు తిరిగివ్వకుండా వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలో గ్రానైట్ వ్యాపారి వద్ద, పసుమర్రు జగనన్న కాలనీ ఏర్పాటుకు సేకరించిన భూముల వ్యవహారంలో రైతుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని రజినిపై ఆరోపణలు వచ్చాయి.

తక్షణమే ఎఇఇ పోస్టులు భర్తీ చేయండి

- ఎపిఎస్ఇబి ఎఇఇ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (ఎఇఇ) నియామకాలను తక్షణమే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ 48వ వ్యవస్థాపక దినోత్సవం విజయవాడలో సోమవారం జరిగింది. అనంతరం ఆ సంఘం సమావేశం జరిగింది. నేరుగా నియమించబడిన ఇంజనీర్ల హక్కులు, ఉద్యోగోన్నతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని నిర్ణయించింది. జూనియర్ ఇంజనీర్ (జెఇ) నుంచి అసిస్టెంట్ ఇంజనీర్ (ఎఇ)గా ఒకసారి మాత్రమే జరిగే పరిపాలనా మార్పులను నిలిపివేయాలని డిమాండ్ చేసింది. విద్యుత్ రంగ అభివృద్ధికి తన వంతు పాత్రను కొనసాగించాలని తెలిపింది. ఇటీవల సంభవించిన మొంథా తుపాను అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో సంఘం సభ్యులు, ఇంజనీర్లు అహర్నిశలూ శ్రమించి అద్భుతమైన సేవలు అందించారని పేర్కొంది. సభ్యుల హక్కు పరిరక్షణకు, విద్యుత్ రంగంలో సామర్థ్యం, నాణ్యత పెంపు కార్యక్రమాలకు అంకితభావంతో సహకరిస్తుందని పునరుద్ఘాటించింది. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి ప్రవీణ్‌కుమార్, ఎవిఎస్ సత్యనారాయణ, సహాయ అధ్యక్షులు జి మల్లికార్జున, సహాయ ప్రధాన కార్యదర్శి ఆర్ రవికుమార్ పాల్గొన్నారు.

కర్నూలు బస్సు ప్రమాదంపై కేంద్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో దగ్ధమైన వేమూరి కావేరీ ట్రావెల్ బస్సును కేంద్ర రవాణా అధికారుల బృందం, సేవ్‌లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. ఈ ప్రమాద ఘటనపై నాలుగు రోజుల పాటు దర్యాప్తు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా, ఈ ఘటనలో 19 మంది మృతి చెందడానికి బస్సు కిటికీలకు అమర్చిన ఇనుప కడ్డీలే ప్రధాన కారణమని పోలీసులు గుర్తించారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అధికారుల బృందం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.



కర్నూలు రైల్వే స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే

ఉన్న రైళ్లను రద్దు చేయడమా...?

- కర్నూలు టు విజయవాడకు ఇంటర్‌సిటీ రైలును నడపాలి
- మహాధర్నాలో సిపిఎం నేతలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు నగర ప్రజల సౌకర్యార్థం రైల్వే సమస్యలు పరిష్కరించకపోతే రైల్వేలను స్తంభింపజేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే ఉన్న రైళ్లను రద్దు చేయడమా? అని సిపిఎం నాయకులు ప్రశ్నించారు.

కర్నూలు నుంచి విజయవాడకు ఇంటర్‌సిటీ రైలును నడపాలని, ఆగిపోయిన మచిలీపట్నం రైలును కొనసాగించాలని, రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ పూర్తి చేసి యువతకు ఉపాధి కల్పించాలని, కొత్త రైల్వే లైన్లు వేయాలని సిపిఎం ఓల్డ్, న్యూసిటీ కమిటీలు కర్నూలు రైల్వే స్టేషన్ ముందు ఈనెల ఒకటో తేదీ నుండి 48 గంటల దీక్షలు చేపట్టాయి. అనంతరం సోమవారం మహాధర్నా చేపట్టారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నానుద్దేశించి కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రం విడిపోయిన తర్వాత 2015 నుంచి కర్నూలు నగరానికి రైల్వే సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి, రైల్వే అధికారులకు విన్నవించినా కదలిక లేకపోవడం దుర్మార్గమన్నారు. రైల్వేవ్యాగన్ నిర్మాణం పూర్తయితే ఐదు వేల మంది యువతకు ఉపాధి లభించే అవకాశం ఉందని అన్నారు. గుంటూరు వరకు నడుస్తున్న కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ వరకు పొడిగించాలని, కర్నూలు నగరం నుండి అనేకమంది వ్యాపారులు, మధ్య తరగతి ప్రజానీకం ముంబయి, సూరత్ వెళ్తూ ఉంటారని, రైలు మార్గం ఉంటే చౌకగా ప్రయాణం చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. తుంగభద్ర, కర్నూలు, శ్రీశైలం వరకు రైల్వే ట్రాక్ నిర్మాణం చేపట్టాలని కోరారు. కర్నూలు-ఓర్వకల్లు - నంద్యాల రైల్వే ట్రాక్ నిర్మాణాన్ని చేపట్టాలని, డోన్ నుండి మహబూబ్‌నగర్ వరకు డబుల్‌ట్రాక్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, రద్దు చేసిన మచిలీపట్నం, విశాఖపట్నం రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కర్నూలు నగర ప్రజల రైల్వే సమస్యలను స్టేషన్ మాస్టర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తున్నామని తెలిపారు. సమస్యలు పరిష్కారానికి రాబోయే కాలంలో ప్రజలను సమీకరించి రైల్వేను స్తంభింపచేస్తామని హెచ్చరించారు. అనంతరం స్టేషన్ మాస్టర్‌కు నాయకులు వినతి పత్రం ఇచ్చారు. స్టేషన్ మాస్టర్ మాట్లాడుతూ... ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి ఆనంద్ బాబు, ఎండి.అంజిబాబు ఆయా ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రైల్వే సమస్యలపై అభ్యుదయ గీతాలను ప్రజానాట్యమండలి బృందం ఆలపించింది.

జోగి రమేష్‌కు రిమాండ్

- విజయవాడ నుంచి నెల్లూరు జైలుకు తరలింపు

ప్రజాశక్తి - విజయవాడ

నకిలీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి, వైసిపి నేత జోగి రమేష్, ఆయన సోదరుడు రాముకు న్యాయస్థానం పది రోజుల రిమాండ్ విధించింది. ఈ నెల 13వ తేదీ వరకు వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు తొలుత విజయవాడ జైలుకు వారిని తరలించారు. అనంతరం నెల్లూరు జైలుకు మార్చారు. ఆదివారం ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అనంతరం విజయవాడలోని తూర్పు ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి తరలించి సుమారు 12 గంటల పాటు విచారించారు. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న జనార్ధనరావుతో ఉన్న సంబంధాలపై అధికారులు ఆరా తీశారు. రమేష్‌తో పాటు ఆయన సోదరుడు రామును కూడా వేర్వేరుగా, కలిపి ప్రశ్నించి వివరాలు సేకరించారు. విచారణ అనంతరం వైద్య పరీక్షలు పూర్తి చేసి సోదరులిద్దరినీ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇరుపక్షాల వాదనలు ప్రారంభమయ్యాయి. సుదీర్ఘ వాదనల అనంతరం సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకు న్యాయమూర్తి తీర్పు వెలువరిస్తూ రిమాండ్‌కు ఆదేశించారు. భద్రతా కారణాల రీత్యా విజయవాడ నుంచి నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.

ఆలయాల్లో యాత్రికుల

భద్రత, సౌకర్యాల కల్పనపై దృష్టి

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆలయాల్లో యాత్రికుల భద్రత, సౌకర్యాల కల్పన కోసం దేవాదాయ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూశాఖలు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. కార్తీకమాసం రద్దీకి తగిన విధంగా ఏర్పాట్లు అవసరమన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్‌పి, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. సామర్లకోట, కుమార భీమేశ్వరస్వామి, అన్నవరం, శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయాలతో పాటు పలు ప్రధాన ఆలయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో దేవాదాయశాఖ ఆలయాల దగ్గర తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రసిద్ధ క్షేత్రాలతో పాటు ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల నిర్వహణలో ఎన్ని ఆలయాలు ఉన్నాయో దేవాదాయశాఖ అధికారులు నివేదిక సిద్ధం చేసి అందించాలన్నారు. ఈ నెల 5న కార్తీక పౌర్ణమి రోజు రద్దీ అధికంగా ఉంటుందని, శని, ఆది, సోమవారాల్లో యాత్రికుల సంఖ్య ఊహించని విధంగా ఉంటుందన్నారు. రద్దీకి తగ్గట్లు ఆలయాల్లో క్యూలైన్లు, పరిసరాల్లో సిసి కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ సమయాల్లో ఆయా క్షేత్రాల మీదుగా వెళ్లే జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ ప్రమాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయాల దగ్గర మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

మందస ఎయిర్‌పోర్టు భూముల సర్వే

- అడ్డుకున్న రైతులు, స్థానిక ప్రజలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, మందస, వజ్రపుకొత్తూరు

మందస ఎయిర్‌పోర్టుపై ప్రభుత్వం తెగ పరితపించిపోతోంది. ప్రజల కష్టాలు, వారి ఇబ్బందులతో నిమిత్తం లేకుండా తన పనేదో తాను చక్కబెట్టుకోవాలని చూస్తోంది. ఇటీవల మొంథా తుపానుతో ప్రజలు భయాందోళనల్లో ఉంటుండగానే జోరు వానలోనే అధికారులు మందస మండలం బిడిమి, రాంపురం గ్రామాల్లో సర్వేకు యత్నించారు. రైతులు, ప్రజలు అడ్డుకోవడంతో వెనక్కి వెళ్లిపోయారు. పలాస ఆలయ దుర్ఘటనతో ఉద్దానం ప్రాంతంలో నేటికీ విషాదఛాయలు అలుముకున్న తరుణంలోనే మరోసారి సర్వేకు ఉపక్రమించింది. ప్రజలు అంతా అదే చర్చలో ఉంటుండగానే ప్రభుత్వం తన పని తాను కానిచ్చుకోవాలని చూస్తోంది. భూముల సర్వేకు ఈసారి ఏకంగా ఆర్‌డిఒ జి.వెంకటేష్ స్వయంగా రంగంలోకి దిగారు. సోమవారం ఆయన తన సిబ్బందితో కలిసి మందస మండలం బిడిమి, ఎం.గంగువాడ, రాంపురం, లక్ష్మీపురం, భేతాళపురం గ్రామాలను సందర్శించారు. ఆర్‌డిఒ రాకపై బయటకు సమాచారం పొక్కనీయకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. అధికారుల రాకను పసిగట్టిన మందస కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు రైతులకు సమాచారం ఇవ్వడంతో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, కమిటీ సభ్యుల ఆధ్వర్యాన అధిక సంఖ్యలో రైతులు, మహిళలు, యువకులు భూముల సర్వే చేపడుతున్న ప్రాంతానికి చేరుకున్నారు.



ఆర్‌డిఒ కారును అడ్డగిస్తున్న గ్రామస్తులు

సర్వే పొరపాట్లు సరిచేయడానికేనంటూ...

భూముల సర్వేకు సిద్ధమవుతున్న తరుణంలో ఎయిర్‌పోర్టుకు భూములు ఇవ్వబోమని చెప్పిన తర్వాత కూడా సర్వేకు రావడమేమిటని రైతులు నిలదీశారు. సర్వే చేయాలనుకుంటే ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో తప్ప వేరే చోట చేసుకోవాలని హితవు పలికారు. తాము ఎయిర్‌పోర్టుకు భూముల సర్వేకు రాలేదని, భూముల సర్వే నంబర్లు సరిచేయడానికి వచ్చామని నమ్మబలికేందుకు అధికారులు ప్రయత్నించారు. తమ పేరిట ఉన్న భూముల వివరాలు, సర్వే నంబర్లతో అడంగల్, 1బి కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగితేనే కనీసం పట్టించుకోని మీరు మా కోసం వచ్చారంటే ఎలా నమ్ముతామంటూ రైతులు ప్రశ్నించారు. మరోవైపు మహిళలు సైతం గట్టిగా నిలదీయడంతో అధికారులు నీళ్లు నమిలారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో అధికారులు వెనుదిరిగారు

వజ్రపుకొత్తూరులోనూ అదే పరిస్థితి

వజ్రపుకొత్తూరు మండలంలోని అనకాపల్లి గ్రామానికి వెళ్లిన తహశీల్దార్ సీతారామయ్యను, సిబ్బందిని రైతులు, స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. ఉద్యాన వంటలను నమ్ముకుని జీవనోపాధి సాగిస్తున్న తమ ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ఎటువంటి సర్వేలు చేయొద్దని తేల్చి చెప్పారు. భూములిచ్చేది లేదని చెప్తున్నా సర్వేకు రావడమేమిటని నిలదీశారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మధు

జక్కా వెంకయ్య బాటలోనే పయనిద్దాం : పి.మధు

ప్రజాశక్తి-దగదర్తి (నెల్లూరు జిల్లా)

సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య బాటలోనే ప్రతి ఒక్క సిపిఎం కార్యకర్త పయనించాలని రాజ్యసభ మాజీ సభ్యులు పి మధు అన్నారు. నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలోని జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో జక్కా వెంకయ్య జయంతి, గోపసాని వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వంటేరు సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మధు మాట్లాడుతూ.. రక్తదానం చేయడమంటే ప్రాణదానం చేసినంత గొప్ప అని కొనియాడారు ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం అందక చనిపోయే పరిస్థితుల్లో రక్తాన్ని ఇచ్చి వారి ప్రాణాలు కాపాడుతారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను ఇంకెన్నో చేపట్టాలన్నారు. పాఠశాలలపైనా దృష్టి పెట్టి అక్కడ కూడా మన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పేదల సమస్యల పరిష్కారానికి జక్కా వెంకయ్య కృషి చేసే వారని కొనియాడారు. భూ సమస్యలపై నిరంతరం పోరాటం చేసి పేదల పక్షాన నిలబడే గొప్ప వ్యక్తి అని అన్నారు. ఇలాంటి విజ్ఞాన కేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం మోహన్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా జక్కా వెంకయ్య రెండు దఫాలు గెలిచారన్నారు. దగదర్తిలో రైతులు సంతోషంగా ఉన్నారంటే ఆయన చేసిన కృషేనని కొనియాడారు. ఎమ్మెల్యే అయిన సందర్భంగా దగదర్తి, మంగమూరు కాలువ కోసం ఆయన ఎంతో కష్టపడ్డారన్నారు. మిత్రపక్షంగా ఉన్న టిడిపికి చెందిన నాయకులతో గట్టిగా మాట్లాడి దగదర్తి, ముంగమూరు కాలువ పనులను ప్రారంభించారని గుర్తుచేశారు. ఆ కాలువపై సుమారు 23 చెరువులకు నీరు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, తుళ్లూరు గోపాల్, ముత్యాల గురునాథం, గోపసాని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ హాస్టల్ శిక్షణా కేంద్రాన్ని పున:ప్రారంభించండి

- సిఎంకు వి.శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వెనుకబడిన గిరిజన ప్రాంతాల విద్యార్థుల ఉన్నత విద్యావకాశాల అభివృద్ధి కోసం మారికవలసలోని ట్రైబల్ హాస్టల్ శిక్షణా కేంద్రాన్ని పున:ప్రారంభించాలని, రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు నిధులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈమేరకుముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సోమవారం ఆయన లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ ఆధ్వర్యంలో 2017లో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ పేరుతో విశాఖ ఏజెన్సీలో ఉన్న ఐదు రెసిడెన్షియల్ జూనియల్ కాలేజీలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉత్తమంగా రాణించిన వారిని ఎంపిక చేసి ఉత్తమ శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. దీనికి ప్రత్యేకంగా ఉమ్మడి విశాఖపట్నం మధురవాడ ప్రాంతంలోని మారికవలస రెసిడెన్షియల్ కాలేజీలో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం సుమారు 80 నుండి 100 మంది విద్యార్థులకు ప్రత్యేక సిబ్బంది ద్వాఆర శిక్షణ ఇస్తున్నారని వివరించారు. 2017 నుండి ఇప్పటి వరకూ 356 మంది విద్యార్థులు శిక్షణ పొందారని, వీరంతా ఐఐటి, ఎన్ఐటి, నీట్, లాసెట్ వంటి ఉన్నత స్థాయి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి వాటిల్లో ప్రవేశాలు పొందారని పేర్కొన్నారు. ఈ తరహాలోనే శ్రీకాకుళం జిల్లానూ సూపర్-60 పేరుతో కోచింగ్ ఇస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఈ కేంద్రం ద్వారా ఆదివాసీ విద్యార్థులకు నెలకు ఒక్కొక్కరికి రూ.20 వేల వ్యయంతో ఏడునెలల పాటు శిక్షణ ఇచ్చేవారని తెలిపారు. వీటి నిర్వహణ కోసం సంవత్సరానికి రూ.20 లక్షల నిధులు కేటాయించేవారని, ఈ శిక్షణ ద్వారా ఐదుగురు ఐఐటి, 25 మంది లాసెట్, 26 మంది నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్యావకాశాలు పొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం శిక్షణ సిబ్బందికి తక్కువ వేతనాలు చెల్లించడమేకాక, ఈ సంవత్సరం రెండు నెలల జీతాలు మాత్రమే మంజూరు చేశారని తెలిపారు. దీంతో ఆ శిక్షణా కేంద్రం మూతపడిందని, దీనితో గిరిజన ప్రాంత విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా ఉందని తెలిపారు. దీనిపై మీతోపాటు విద్యాశాఖ మంత్రి కూడా వెంటనే జోక్యం చేసుకుని మారికవలస శిక్షణా కేంద్రాన్ని పున:ప్రారంభించేందుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. గుంటూరు, కర్నూలు వంటి ప్రాంతాల్లో కూడా ఇలాంటి ప్రత్యేక కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

రాష్ట్రంలో రూ.20వేల కోట్ల పెట్టుబడులు

(మొదటిపేజి తరువాయి)

ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని సిఎం తెలిపారు. రోల్స్‌రాయిస్ సంస్థ సిటిఒ నిక్కి గ్రేడిస్మిత్‌తో సిఎం చర్చించారు. ఓర్వకల్లులో మిలటరీ ఎయిర్ స్ట్రిప్, విమానాల మెయింటినెన్స్, ఓవర్ హాలింగ్ యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను వివరించారు. వరుస భేటీల్లో ఎస్ఆర్ఎఎం, ఎంఆర్ఎఎం గ్రూప్ చైర్మన్ శైలేష్ హీరనందానితో మాట్లాడారు. సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడులకు ఈ సంస్థ ఆసక్తి చూపించింది. శామ్కో హోల్డింగ్స్ లిమిటెడ్ చైర్మన్ సంపత్‌కుమార్ మల్లాయతో మాట్లాడారు.

దుబాయ్‌లో నారాయణ పర్యటన

విశాఖలో జరిగే సిఐఐ సమ్మిట్‌కు రావాలని దుబాయ్‌లోని వ్యాపారవేత్తలను మంత్రి నారాయణ కోరారు. దుబాయ్ పర్యటనలో భాగంగా మొదటిరోజు అక్కడే శోభా గ్రూప్ వైస్ ప్రెసిడెంట విక్రమ్‌దత్తాతో సమావేశం అయ్యారు. ఎపిని పెటుట్బడులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చే ప్రయత్నం చేస్తున్నామని వారికి తెలిపా3రు. కెఈఎఫ్ హోల్డింగ్స్ ప్రధాన కార్యాలయంలో సంస్థ చైర్మన్ ఫైజల్ కొట్టికోలన్‌తో మంత్రి నారాయణ బేటీ అయ్యారు. విద్యారోగ్య రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మంత్రి నారాయణ వారిని కోరారు. ఈ పర్యటనలో సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు, మున్సిపల్‌శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్, రిటైర్డ్ ఐఎఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మృత్యుఘోష

(మొదటిపేజి తరువాయి)

వేగంగా వస్తున్న టిప్పర్ ఈ బస్సును ఢీకొట్టింది. డ్రైవర్ క్యాబిన్‌ను చీల్చుకుంటూ ఐదు వరుసల సీట్ల వరకు వెళ్లి బస్సుపై పల్టీ కొట్టింది. టిప్పర్‌లోని కంకర బస్సులోని ప్రయాణికులపై పడింది. ప్రమాద ధాటికి గాయాలతో కొందరు, కంకరలో ఇరుక్కుపోయి మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. చేవెళ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. జెసిబి సహాయంతో టిప్పర్‌ను వేరుచేశారు. బస్సులో ఇరుక్కుపోయిన వారిని అతికష్టమ్మీద బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన 24 మంది ప్రయాణికులను దగ్గర్లోని ఆస్పత్రులలో చేర్చారు. 19 మంది మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలిని స్పీకర్ ప్రసాద్‌కుమార్, తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పరిశీలించారు. మృతుల కుటుంబాలకు రూ.7 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని మంత్రి పొన్నం చెప్పారు. ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, సబితా ఇంద్రారెడ్డి స్థానికుల నిరసనతో వెళ్లిపోయారు.

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : జాన్‌వెస్లీ

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఈ ఘటనకు గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని సిపిఎం తెలంగాణ నాయకులు డిజి.నర్సింహారావు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాడిగాళ్ల భాస్కర్, ఇతర నేతలతో కలిసి ఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హత్యల



బస్సులో పడిన కంకరలో కూరుకుపోయి నరకయాతన పడుతున్న మహిళలు

కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది చనిపోతున్నారని డిజిపి చెప్పిన రెండు రోజుల్లోనే ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. ఉదయాన్నే వెళ్తున్న టిప్పర్‌కు అనుమతి ఉందా? లేదా? తెలుసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

ప్రముఖుల దిగ్భ్రాంతి

చేవేళ్లలోని మీర్జాపూర్ శివారులో ఆర్‌టిసి బస్సు ఘటనపై ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు.

నా ప్రగాఢ సానుభూతి : రాష్ట్రపతి ముర్ము

బస్సు ప్రమాదంలో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలుపుతున్నా. గాయపడిన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను.

ఘటన బాధాకరం : ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్

బస్సు ప్రమాదంలో భారీ ప్రాణ నష్టం బాధను మిగిల్చింది. ప్రాణాలు కోల్పోయిన వారితోనే నా ఆలోచనలు ఉన్నాయి. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుతున్నా. ఇంత ప్రాణనష్టం బాధాకరంగా ఉంది.

మనసును కలచివేసింది : వైఎస్ జగన్

అభంశుభం తెలియని ప్రయాణికులు మరణించడంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన మనసును కలచివేసిందని తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

ఫోన్ కోసం ఇంటికొచ్చి...

యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన ఎంబిఎ విద్యార్థిని అఖిల ప్రియారెడ్డి ఆదివారం సెలవు ఉండడంతో శనివారం రాత్రి సొంత గ్రామానికి కొత్త ఫోన్ కొనుక్కోవడానికి వచ్చారు. తిరిగి సోమవారం ఉదయం హైదరాబాద్ బయలుదేరారు. బస్సు ఎక్కి బయలుదేరిన తర్వాత ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్పారు. ఇంతలోనే ప్రమాదంలో ఆమె మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

దిక్కుతోచని స్థితిలో చిన్నారులు

తాండూర్ బృందావనీ కాలనీకి చెందిన అబ్దుల్ మజీద్ భార్య పిల్లలతో తాండూర్ నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి వస్తున్నారు. ప్రమాదంలో ఆయన భార్య చనిపోయారు. తీవ్రంగా గాయపడిన మజీద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరి ముగ్గురు పిల్లలు అసలు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. వచ్చిపోయే వారిని చూస్తూ ఉండిపోయారు. వీరిని చూసి స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు.

కంకరలో చిక్కుకున్న టీచర్

వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం కేరెల్లి గ్రామానికి చెందిన తొల్కట జయసుధ బంట్వారం గురుకుల పాఠశాలలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. పని నిమిత్తం హైదరాబాద్ వస్తున్న క్రమంలో బస్సు ప్రమాదం జరగగా.. ఆమె కంకరలో చిక్కుకుని విలవిలలాడారు. ఆమెను నిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అనాథలైన చిన్నారులు

వికారాబాద్ జిల్లా యాలాల మండలం హాజీపూర్‌కు చెందిన భార్యాభర్తలు లక్ష్మి, బంధయ్య ప్రమాదంలో చనిపోయారు. లక్ష్మికి బాగా లేదని హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వీరి పిల్లలు శివనీల, భవాని (4వ తరగతి) అనాథలయ్యారు. తల్లిదండ్రుల మృతదేహాలను వద్ద చిన్నారుల రోదనలు మిన్నంటాయి.

అత్తాకోడళ్లు దుర్మరణం

హైదరాబాద్ బోరబండకు చెందిన అత్తా కోడళ్లు గోగుల గున్నమ్మ, కల్పన... తాండూర్ నుంచి హైదరాబాద్ వస్తూ ప్రమాదంలో మరణించారు.

తల్లీబిడ్డ మృతి..



తాండూర్‌కు చెందిన సెలెహ బేగంతో ఆమె కూతురు జహీరా ఫాతిమా (40 రోజుల పసికందు) దురర్మణం చెంచారు. తల్లీబిడ్డ మృతదేహాలు రోడ్డుపై చూసిన ప్రతి ఒక్కరూ కన్నీరు పెట్టారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఆరుగురు దుర్మరణం

- పలువురికి గాయాలు
- బాపట్ల, అనకాపల్లి జిల్లాల్లో ఘటనలు

ప్రజాశక్తి-కర్లపాలెం (బాపట్ల జిల్లా), యలమంచిలి టౌన్ (అనకాపల్లి జిల్లా)

వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఆరుగురు దుర్మరణం చెందారు. బాపట్ల, అనకాపల్లి జిల్లాలల్లో సోమవారం ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు స్థానికులు తెలిపిన కథనం ప్రకారం... బాపట్ల జిల్లా కర్లపాలెంకు చెందిన బేతాళం బలరామరాజు (65), బేతాళం లక్ష్మి (60), గాదిరాజు పుష్పావతి (60), ముదునూరి శ్రీనివాసరాజు (54), గాదిరాజు వైష్ణవి, గాదిరాజు జయంత్‌వర్మ కారులో బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ కుమారుడి సంగీత్‌కు వెళ్లారు. అక్కడ నుంచి ఆదివారం అర్ధరాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. సత్యవతిపేట సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వారి కారును ఢీకొట్టింది. దీంతో కారులోని ఉన్న బలరామరాజు, బేతాళం లక్ష్మి, గాదిరాజు పుష్పావతి, ముదునూరి శ్రీనివాసరాజు అక్కడికక్కడే మృతి చెందారు. గాదిరాజు వైష్ణవి, గాదిరాజు జయంత్‌వర్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరిని చీరాల, మరొకరిని గుంటూరు ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనకాపల్లి జిల్లా యలమంచిలి సమీపం కొక్కిరాపల్లి ఎన్‌హెచ్-16పై ప్రేమసమాజం ఆశ్రమం వద్ద ఆగి ఉన్న ఆటోను టాటా మ్యాజిక్ అతివేగంగా వెనుక నుండి ఢీకొట్టింది. ఆటోలో ఉన్న కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన గొంది పెంటయ్య (56), నర్సీపట్నం దనిమరెడ్డి వీధికి చెందిన బాదంపూడి లక్ష్మి (65) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ఉన్న మరో ఆరుగురు, టాటా మ్యాజిక్‌లో ఉన్న పది మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి తీవ్రగాయాలైన ఎనిమిది మందిని మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కెజిహెచ్‌కు, ఆరుగురిని అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న హోం మంత్రి అనిత క్షతగాత్రులను తన కాన్వాయ్ వాహనాల్లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం ఆమెతో పాటు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, యలమంచిలి సిఐ ధనుంజయరావు, రూరల్ ఎస్ఐ ఉపేంద్ర, టౌన్ ఎస్ఐ సావిత్రి, తహశీల్దార్ వరహాలరావు ఆస్పత్రికి వెళ్లి వైద్యసేవలను పర్యవేక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆమె ఆదేశించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం (చిత్తూరు జిల్లా)

విద్యుదాఘాతంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని బండ్లదొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. పలమనేరు డిఎస్‌పి డేగల ప్రభాకర్ తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన గోవిందస్వామి (32), కుట్టెప్ప (45) బహిర్భూమికి వెళ్లారు. అయితే సోమవారం తెల్లవారుజామున విగతజీవులుగా కనిపించారు. గ్రామ సమీపంలోని మామిడితోపులోకి అడవి పందులు రాకుండా రైతు విద్యుత్ వైర్లను అమర్చారు. బహిర్భూమికి వెళ్లిన ఇద్దరికి ఆ వైర్లు తగలడంతో మృతి చెందారు. వారి మృతదేహాల పక్కనే ఓ అడవి పంది కూడా మృతి చెంది ఉందని డిఎస్‌పి తెలిపారు. గోవిందస్వామికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కుట్టెప్పకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు పలు జిల్లాల్లో వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఆ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సమయాల్లో చెట్ల కింద నిలబడరాదని ఆ సంస్థ సూచించింది.

మహిళా క్రికెట్ జట్టుకు ఐద్వా అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

క్రికెట్ వరల్డ్ కప్‌లో విశ్వవిజేతగా నిలిచిన భారత మహిళా క్రికెట్ జట్టుకు ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, వి సావిత్రి అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో రెండుసార్లు ఫైనల్‌కు చేరి కప్‌కు దూరమైన జట్టు ఈసారి పట్టుదలతో ఆడి విజయం సాధించిందని పేర్కొన్నారు. మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టించగలరని ఇప్పటికే అనేక రంగాల్లో రుజువైందని తెలిపారు. మగవారి ఆటగా ఉన్న క్రికెట్‌లో మహిళలు ప్రవేశించడమే అనేక ఆటంకాల మధ్య జరిగిందని గుర్తు చేశారు. విజయాలు సాధించినప్పుడు ప్రభుత్వాలు అభినందించడం కాకుండా ప్రత్యేక ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు.

ఎపి ఆర్‌సెట్ 2024-25 పరీక్ష ప్రారంభం

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్



ఎపిఆర్‌సెట్‌ను ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తున్న వైస్ ఛాన్సలర్ ఉమ

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీస్‌లోని పిహెచ్‌డి కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎపి ఆర్‌సెట్ 2024-25 పరీక్ష సోమవారం ప్రారంభమైంది. మొత్తం 65 కోర్సులకు 5,752 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు, ఆంధ్రప్రదేశ్‌లో 13 సెంటర్లు, తెలంగాణాలో ఒక సెంటర్‌లో పరీక్ష నిర్వహించినట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి తెలిపారు. తొలిరోజు సోమవారం 90 శాతం మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఈ నెల 4, 6, 7 తేదీలలో కూడా ఉదయం, మధ్యాహ్నం పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా పరీక్షను పద్మావతి మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఈ పరీక్షను నిర్వహిస్తుంది.

రూ.18 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కైంకర్యం

- అధికార పార్టీ ముఖ్యనేత అండతో అమ్మకం!
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డు పెడుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి- పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో నడిబొడ్డునగల సుమారు 18 కోట్ల రూపాయల విలువైన గెడ్డ పోరంబోకు ప్రభుత్వ భూమిని ఆక్రమించి అమ్మేసిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొద్దిరోజుల క్రితం ఈ భూమిని వేరొక సర్వే నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ వ్యవహారంలో ఈ నియోజకవర్గానికి చెందిన ఓ కీలకనేత అండదండలు పుష్కలంగా ఉన్నాయని, ఆయనకు రూ.2 కోట్లు మేర ముడుపులు అందాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో సర్వే నెంబర్ 410లోగల వరహాలు గెడ్డ పోరంబోకు భూమిని సర్వే నెంబర్ 411తో రిజిస్ట్రేషన్ చేయించారు. పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి సర్వే నెంబర్ 411లో 400 గజాల జిరాయితీ స్థలం ఉంది. ఈ పక్కనే ఉన్న సర్వే నెంబర్ 410లో 800 గజాల గెడ్డపోరంబోకు ప్రభుత్వ భూమిపై ఆ వ్యాపారి కన్నేసి నియోజకవర్గ ముఖ్యనేతను సంప్రదించి డీల్ కుదుర్చుకున్నట్లు ప్రచారం. జిరాయితీ స్థలం, ప్రభుత్వ గెడ్డ పోరంబోకు భూమి కలిపి మొత్తం 1,200 గజాల స్థలాన్ని కొద్ది రోజుల క్రితం విశాఖకు చెందిన ఓ షాపింగ్ మాల్ యజమానికి ఆ వ్యాపారి రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

లోకాయుక్తకు ఫిర్యాదు : సిపిఎం

వరహాలగెడ్డ పోరంబోకు ప్రభుత్వ భూమిని కొందరు భూ బకాసురులు తప్పుడు సర్వే నంబర్లు నమోదు చేసి ఇటీవల రిజిస్ట్రేషన్ చేయించారని తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు తదితరులు సోమవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ భూమిని గతంలో ప్రభుత్వ భూమిగా రెవెన్యూ అధికారులు గుర్తించి బోర్డులను, సరిహద్దు రాళ్లను పెట్టారని, ఇప్పుడు ప్రైవేటు భూమిగా ఎలా యాజమాన్య హక్కులను బదలాయిస్తారని ప్రశ్నించారు. సర్వే నెంబర్ 410కు చెందిన ప్రభుత్వ గెడ్డ పోరంబోకు భూమిని పట్టణంలో ఇటీవల తొలగించిన చిరు వ్యాపారులకు పంపిణీ చేయాలని, లేదంటే ఈ సరిహద్దు రాళ్లను తొలగించి సిపిఎం ఆధ్వర్యాన భూ పంపిణీ చేపడతామని హెచ్చరించారు. కలెక్టర్ తక్షణమే ఈ సమస్యపై సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, బివి రమణ తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపడతాం : తహశీల్దార్ సురేష్

వరహాలు గెడ్డ పోరంబోకు భూమి సర్వే నెంబర్ 410లో ఆక్రమణ, విక్రయాలపై విచారణ జరిపిస్తామని పార్వతీపురం తహశీల్దార్ సురేష్ తెలిపారు. ప్రభుత్వ భూమి విక్రయంపై 'ప్రజాశక్తి' ఆయనను వివరణ కోరగా బాధ్యులపై చర్యలు తీసుంటామని తెలిపారు.

స్వప్రయోజనాలే లక్ష్యంగా కూటమి పాలన

- వైసిపి కో-ఆర్డినేటర్ సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో స్వప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే రాజకీయ వ్యవస్థ శూన్యమని అన్నారు. నేరస్వభావాన్నే రూల్ ఆఫ్ లాగా నడుపుతున్నారని విమర్శించారు. జోగి రమేష్ అరెస్టు అక్రమమని పేర్కొన్నారు. ప్రతిపక్షం, ప్రజల ఆకాంక్షల గొంతు నొక్కుతున్నారని, ఉద్దేశపూర్వకంగా క్రూరంగా అణచివేస్తున్నారని విమర్శించారు.

జగన్ పాలనలో మంచిని వివరించాలి

వైసిపి నిర్వహిస్తున్న కార్యక్రమాలను విస్తృతంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లోకి తీసుకురావాలని సజ్జల తెలిపారు. వైసిపి నియోజకవర్గ డిజిటల్ మేనేజర్ల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియాలో ఎండగట్టాలన్నారు. అన్ని కార్యక్రమాలను నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు చేరే విధంగా నిర్వహణ ఉండాలని తెలిపారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కార్యాలయం నుండి వచ్చే సమాచారాన్ని క్షేత్రస్థాయి వరకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఇ పార్కుల్లో మౌలిక వసతుల కల్పన

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

175 నియోజకవర్గాల్లో అభివృద్ధి చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కుల్లో మౌలిక వసతుల కల్పన త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. సచివాలయంలోని ఎంఎస్ఎంఇ, ఎపిఐఐసి అధికారులతో సమీక్షా సమావేశాన్ని మంత్రి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానాలతో ఎంఎస్ఎంఇల అభివృద్ధిని వేగవంతం చేయాలని, ఇందుకు తగిన కార్యాచరణ, స్పష్టమైన భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహకాలను సమర్థవంతంగా నూతన పారిశ్రామికవేత్తలు వినియోగించుకునేలా ఎప్పటికప్పుడు పనిచేయాలని, వారికి అవసరమైన చట్టపరమైన అనుమతులను జారీచేసే విషయంలో జాప్యం చేయరాదని సూచించారు. నూతన పారిశ్రామికవాడల్లో నిర్మించ తలపెట్టిన భవనాలు, ఇతర మౌలిక వసతులపై ఈ సమీక్షా సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలుచేస్తున్న పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలకు అనుగుణంగా రాష్ట్రంలో పారిశ్రామిక విధానం ఉండాలని, ఇందుకోసం అవసరమైన మార్పులు, చేర్పులతో వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్, ఎంఎస్ఎంఇ అభివృద్ధి సంస్థ సిఇఒ విశ్వమనోహర్, ఎపిఐఐసి అధికారులు పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న వెంకటేశ్వర్లు, పక్కన కలపాడు గ్రామస్తులు

కలపాడులో భూపోరాటం

- వ్యకాసం నేతృత్వంలో 1440 ఎకరాలు స్వాధీనం
- పేదలకు పట్టాలివ్వాలి : వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం కలపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్-1లో 1441 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం వ్యకాసం జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్, ప్రాంతీయ కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య నేతృత్వంలో దళిత గిరిజన పేదలంతా కలిసి పిచ్చిమొక్కలు తొలగించి భూమిని స్వాధీనపరచుకున్నారు. వెనుకబడిన ప్రతి ఒక్కరికీ నాలుగు ఎకరాల చొప్పున భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... గ్రామంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా దళిత గిరిజనులకు పంచకుండా, భూముల్లోకి రానీయకుండా పెత్తందారులు, పాలకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. భూములు లేని నిరుపేదలంతా ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని సాగు చేయాలని ప్రయత్నించినప్పుడల్లా అక్రమ కేసులు బనాయించి కోర్టులు, పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూ అడ్డుకుంటున్నారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కలపాడులోనే 1440 ఎకరాల భూమిని దళిత గిరిజనులకు పంపిణీ చేసి, పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్‌కు, ఆర్‌డిఒకు, కలెక్టర్‌కు అనేక పర్యాయాలు వినతులు సమర్పించినా పట్టించుకోకపోవడం వల్లనే, నిరుపేదలంతా ఎర్రజెండా ఆధ్వర్యంలో భూములను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. భూ సమస్యను రాష్ట్రస్థాయిలో సిపిఎల్ఎ అధికారుల దృష్టికి, రాష్ట్ర రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, నాయకులు బాలసుబ్రమణ్యం, చెంచు కృష్ణయ్య, పెద్దసంఖ్యలో కలపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒఎంసి మైనింగ్ లీజుల్లో సరిహద్దుల నిర్ధారణకు సర్వే

ప్రజాశక్తి - డి. హీరేహాల్

అనంతపురం జిల్లా డి.హీరేహాల్ మండలంలోని వివాదాస్పద ఇనుప గనుల లీజుల విభాగంలో సరిహద్దుల నిర్ధారణకు సోమవారం సర్వే నిర్వహించారు. ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ సరిహద్దు రాళ్ల నిర్ధారణ కోసం సర్వే చేపట్టింది. సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఆర్ జె డి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అటవీశాఖ, గనులు, భూగర్భ శాఖ సిబ్బంది ఓబులాపురం సర్వే నంబర్ వన్‌లోని ఓబుళాపురం (ఒఎంసి)-1 25.94 హెక్టార్లు, ఒఎంసి-2లో 39.48 హెక్టార్లు, ఎఎంసి 6.50 హెక్టార్లు, వైఎం సిద్ధాపురం సర్వే నంబర్ వన్‌లో 20.24, బిఐఒపి మలపనగుడి సర్వే నంబర్-1లోని అంతర్గమ్మ ఇనుప గనులు 68.52 హెక్టార్లలో సరిహద్దుల ఏర్పాటుకు సర్వే నిర్వహించింది. డ్రోన్, జిపిఎస్ పరికరాలతో సరిహద్దులను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ఇంటర్ స్టేట్ బౌండరీల గుర్తింపునకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. మూడు నెలల కాల పరిమితిలో సరిహద్దులను నిర్ధారించి నివేదికను సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో సకాలంలో సర్వే పూర్తిచేసి ఆ నివేదికను సుప్రీంకోర్టుకు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు డిడివై. జయరాజు, డిడి సూర్యరావు, డ్రోన్‌టీం సర్వేయర్లు, మైన్స్, ఫారెస్టు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సిఐఐ సదస్సుతో 9.8 లక్షల కోట్ల పెట్టుబడులు

- 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహణ
- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి 9.8 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. 410 అవగాహన ఒప్పందాలను పలు కంపెనీలతో కుదుర్చుకుంటామని, తద్వారా 7.5 లక్షల కొత్త ఉద్యోగావకాశాలు వస్తాయని పేర్కొన్నారు. సిఐఐ సదస్సుపై మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాసరావు, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్‌తో కలిసి ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం వారితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సమర్థ నాయకత్వం, డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి మూడు విధానాలు వల్ల 16 నెలల్లో రాష్ట్రానికి పెద్దయెత్తున పరిశ్రమలు తరలివచ్చాయని చెప్పారు. అభివృద్ధి వికేంద్రీకరణ, క్లస్టర్ బేస్డ్ అభివృద్ధిపై దృష్టిసారించామని, అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే తమ ధ్యేయమని చెప్పారు. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, కర్నూలులో పునరుత్పాదక విద్యుత్, ప్రకాశం జిల్లాలో సిబిజి, నెల్లూరులో డైవర్సిఫైడ్ ఇండస్ట్రీస్, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్, గోదావరి జిల్లాల్లో ఆక్వా, రిఫైనరీ, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైస్, స్టీల్ సిటీ, డేటా సిటీలు ఏర్పాటవుతాయని పేర్కొన్నారు. విశాఖలో జరిగే సమ్మిట్‌కు 45 దేశాల నుంచి 300 మంది ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు వస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. 2.7 లక్షల కోట్ల పెట్టుబడులు, 2.5 లక్షల ఉద్యోగాలు కల్పించే సంస్థలకు సమ్మిట్‌లో భూమిపూజ చేయబోతున్నామని తెలిపారు. సమ్మిట్‌లో ప్రజలు, ప్రభుత్వం, పెట్టుబడిదారులు కలిసి వస్తేనే అనుకున్నది సాధించగలమని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 1.8 లక్షల ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించబోతున్నామని తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్ బలోపేతం చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమలు రాకుండా వైసిపి విద్వేషాలు రెచ్చగొడుతుందని విమర్శించారు. తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధిని సమగ్ర దిశగా తీసుకెళ్లడమే తమ లక్ష్యమని అన్నారు.

అనిల్ అంబానీ రూ.3 వేల కోట్ల ఆస్తులు అటాచ్

- మనీలాండరింగ్ కేసులో ఇడి కీలక నిర్ణయం
- తూర్పు గోదావరి జిల్లాలోని అసెట్స్ కూడా..



న్యూఢిల్లీ : రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి చెందిన రూ.3వేల కోట్ల పైగా విలువైన ఆస్తులను ఎన్ ఫోర్స్ డైరెక్టరేట్ (ఇడి) అటాచ్ చేసింది. అటాచ్ చేసిన ఆస్తుల లిస్టులో ఆయన ఇంటితో పాటు పలు కమెర్షియల్ ప్రాపర్టీలు ఉన్నాయి. ఈ మేరకు ఇడి అధికారిక వర్గాలు సోమవారం పలు వివరాలను వెల్లడించాయి. బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న ఆయన వాటిని వ్యాపారం కోసం ఉపయోగించకుండా మనీలాండరింగ్ ద్వారా వేరే ఖాతాలకు మళ్లించిన కేసులో ఇడి ఈ నిర్ణయం తీసుకుంది. అటాచ్ చేసిన అస్తుల్లో అనిల్ అంబానీకి చెందిన ముంబయిలోని ఆయన నివాసం, గ్రూప్ సంస్థల యాజమాన్యంలోని ఇతర నివాస, వాణిజ్య ఆస్తులు ఉన్నాయి. వీటికి సంబంధించి తాత్కాలిక ఉత్తర్వులను ఇడి జారీ చేసింది. అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సిబిఐ తొలుత దర్యాప్తు చేపట్టింది. ఆ సంస్థ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి దీనిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. తాజాగా ఢిల్లీలోని మహారాజా రంజిత్‌సింగ్ మార్గ్‌లోని రిలయన్స్ సెంటర్‌కు చెందిన భూమి, నోయిడా, ఘజియాబాద్, ముంబయి, పూణే, థానే, హైదరాబాద్, చెన్నయ్, ఆంధ్రపదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న అనేక ఆస్తులు అటాచ్ చేసిన జాబితాలో ఉన్నాయి. ఈ అటాచ్ చేయబడిన ఆస్తుల విలువ సుమారు 3,084 కోట్లుగా ఉంటుందని అంచనా.

మనీలాండరింగ్ కేసు..

రిలయన్స్ హోం ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ వివిధ బ్యాంకుల నుంచి రుణం తీసుకుని వాటిని ఇతర ప్రయోజనాల కోసం మనీలాండరింగ్ చేశాకరని అనిల్ అంబానీపై ప్రధాన అరోపణలున్నాయి. దాదాపు రూ.17వేల కోట్ల మోసం జరిగిందని ఇడి ప్రాథమిక అంచనా. ఈ విషయంలో తొలుత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనిల్ అంబానీని ఫ్రాడ్‌గా పేర్కొంది. ఆ తర్వాత బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా అంబానీని మోసకారిగా గుర్తించింది. 2017-19 మధ్య యెస్ బ్యాంకు 2,965 కోట్లు, మరోసారి 2,045 కోట్లను ఆ సంస్థలకు రుణంగా మంజూరు చేసింది. కాగా.. 2019 అవి నిరర్థక ఆస్తులుగా మారాయి. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ 1,353 కోట్లు, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ 1984 కోట్లు బకాయి పడ్డాయి. దీంతో అసలు విషయం బయటికి రావడంతో సిబిఐ, ఇడి సంస్థలు విచారణ చేపట్టాయి. రిలయన్స్ గ్రూప్ కంపెనీలు రుణాలను మళ్లించాయనే ఆరోపణలపై జులై 24న ముంబయిలోని 50 ప్రాంతాల్లో ఇడి సోదాలు చేసింది. ఈ కేసులో డైరెక్టర్లు సహ 25 మందిని ప్రశ్నించింది. ఆగస్టులో అనిల్ అంబానీని ఇడి విచారించింది. ఈ కేసులో తాజాగా ఇడి మరింత దూకుడు పెంచి.. అనిల్ అంబానీ వ్యాపార సంస్థలకు సంబంధించిన ఆస్తులను ఆటాచ్ చేసింది.

గూగుల్ డేటా సెంటర్‌కు దళితుల భూములు ఇవ్వొద్దు

- కలెక్టరేట్ వద్ద ధర్నా



విశాఖ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దళిత రైతులు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ దళితుల జీవనాధారమైన 115 ఎకరాల భూములను గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయింపుల నుండి మినహాయించాలని సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. అనంతరం బాధితులతో కలిసి సిపిఎం నాయకులు పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మీడియాతో మాట్లాడుతూ 1971లో రెండు ఎకరాల చొప్పున 53 మందికి ప్రభుత్వ బంజరు భూములు ఇచ్చిందన్నారు. రాళ్లు, రప్పలతో కూడిన భూములను అప్పులు చేసి, కష్టపడి సాగులోకి తెచ్చుకొని ఇన్నాళ్లుగా జీవనాన్ని సాగిస్తున్నారని తెలిపారు. అటువంటి తమ జీవనాధారమైన భూములను డేటా సెంటర్‌కు ఇవ్వబోమని దళితులు మొరపెట్టుకుంటున్నా, ఎలాగైనా ఇవ్వాల్సిందేనని ప్రభుత్వం వెల్లడించడంపై తీవ్రంగా ఖండించారు. గతంలో డంపింగ్ యార్డు, బ్యాటరీ కంపెనీలకు ల్యాండ్ పూలింగ్ పేరుతో భూములు లాక్కోవాలని ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. ఆనందపురం భూముల రీసర్వే పేరుతో ఎల్‌పి నెంబర్లు ఇస్తామని పలకలపై భూముల వివరాలు రాయించి వారితో ఫొటోలు తీశారని, కొద్ది రోజుల తరువాత గూగుల్ డేటా సెంటర్‌కు ఈ భూములను ఇస్తున్నామని, మీకు రావాల్సిన పరిహారం తీసుకెళ్లమని చెప్పి మోసం చేసిన గత తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డేటా సెంటర్‌కు దళితుల భూములను మినహాయించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



శ్రీవారిని దర్శించుకున్న శ్రీలంక మాజీ క్రీడాకారిణి శివలింగం

- పొడవుగా ఉండడంతో ఆశ్చర్యంగా తిలకించిన యాత్రికులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమలలో యాత్రికుల రద్దీ సర్వసాధారణం. అయితే అంతటి రద్దీలోనూ ఓ మహిళ పొడవుగా కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. 'ఔరా... ఇంత ఎత్తా' అంటూ ఒకటికి రెండుసార్లు యాత్రికులు ఆమెను చూశారు. వాహనమల్లై పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామితో కలిసి ఆమె శ్రీవారిని దర్శించుకున్నారు. కాంప్లెక్స్‌లోనూ, క్యూలైన్‌లోనూ, గర్భగుడిలోనూ ఈ పొడవైన మహిళ సందడి చేశారు. ఆమె ఎవరిని ఆరా తీయగా శ్రీలంకకు చెందిన 'నెట్ వాలీబాల్' మాజీ క్రీడాకారిణి తర్జనీ శివలింగం అని తెలిసింది.

సమస్యలు పరిష్కారంచడంలేదని మనస్తాపంతో.. కలెక్టరేట్ వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-బాపట్ల



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బెన్ను

భూ వివాదానికి సంబంధించి ఎన్ని అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదని ఓ వ్యక్తి బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం తీవ్ర కలకలం రేపింది. అంబులెన్స్‌లో బాపట్ల ఏరియా వైద్యశాలకు ఆయనను తరలించారు. ఆస్పత్రిలో కోలుకున్న బాధితుడు మార్పు బెన్ను మాట్లాడుతూ 1981లో షెడ్యూల్డ్ కులాలకు చెందిన 22 కుటుంబాలకు సర్వే నెంబర్ 1158లో 56 ఎకరాల భూమిని ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు.

ఏడేళ్ల క్రితం ఆ భూమిని మన్నె సునీల్ చౌదరికి లీజుకు ఇవ్వగా లీజు సక్రమంగా చెల్లించకపోగా ఆ భూమిలో చేపల చెరువులు వేసి.. ఆయన భార్య మన్నే రాధిక పేరుతో తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించుకున్నారని ఆరోపించారు. తమ భూమిని తమకు అప్పగించాలని గత నెల 13న గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆ ఫిర్యాదు విద్యుత్ శాఖ ఎడి వద్దకు, అక్కడి నుండి చినగంజాం విద్యుత్ ఎఇకి పంపారని తెలిపారు. ఈ సమస్య తన పరిధిలోది కాదని ఎఇ సమాధానం చెప్పారన్నారు. తమ పొలాన్ని స్వాధీనం చేయడం లేదని, అందుకే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని తెలిపారు. న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తానని చెప్పారు.

'ఆదరణ'కు రూ.వెయ్యి కోట్లు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చేతి వృత్తిదారులను ప్రోత్సహించేందుకు ఆదరణ 3.0 పథానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించినట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఆదరణ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు బిసి కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లతో గొల్లపూడిలోని బిసి భవన్‌లో నిర్వహించనున్న 3 రోజుల వర్క్‌షాపును ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిసిలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రతి బిసి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో అధికంగా లబ్ధిపొందేది బిసిలేనని, మెగా డిఎస్‌సిలోనూ బిసి వర్గాల అభ్యర్థులు అధిక సంఖ్యలో ఎంపికయ్యారని వెల్లడించారు. ఆదరణ పథకం అమలుపై కార్పొరేషన్ డైరెక్టర్లు, ఛైర్మన్లు సలహాలు, సూచనలు ప్రభుత్వానికి నివేదించి పథకాన్ని మరింత పారదర్శకంగా, ఎటువంటి లోపాలు లేకుండా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.

నేతన్నలను అన్ని విధాలా ఆదుకుంటాం

నేతన్నలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని చేనేత ఐక్య కార్యాచరణ సమితి నాయకులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

ఆప్కో షోరూములు, ఆన్‌లైన్‌లో విక్రయాలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. మొంథా తుపాను కారణంగా నష్టపోయిన నేత కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. వినతిపత్రంలో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో చేనేత ఐక్య కార్యాచరణ సమితి నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, పి బాలకృష్ణ, రామమనాథం, పూర్ణచంద్రబాబు, కోటేశ్వరరావు, బాలాజి, కుమారి, రామారావు, కృష్ణారావు తదితరులు ఉన్నారు.

విశాఖ సమ్మిట్‌లో టెక్స్‌టైల్స్ ఎంఒయులు

విశాఖపట్నంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న పార్టనర్ షిప్ సమ్మిట్‌లో టెక్స్‌టైల్స్ రంగంలో ఎంఒయులు చేసుకోనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. సచివాలయంలో చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, కమిషనర్ రేఖారాణి, పరిశ్రమలశాఖ యువరాజ్‌తో మంత్రి సమావేశమయ్యారు. పార్టనర్ షిప్ సమ్మిట్‌లో భాగంగా టెక్స్‌టైల్స్ రంగంలో ఎంఒయులకు ప్రత్యేక సమయం కేటాయిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

సంపాదకీయం

వైఫల్యం

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం చోటు చేసుకున్న తొక్కిసలాట దుర్ఘటన మరోసారి నిర్వహణ, భద్రత వైఫల్యాలను ఎత్తిచూపింది. కార్తీక ఏకాదశి కావడంతో ఒకే రోజు వేలాదిగా సందర్శకులు పోటెత్తి తీవ్ర తోపులాట జరిగి తొమ్మిది మంది మృత్యువాత పడటం విషాదం కాగా మరణించిన వారిలో ఎనిమిది మంది మహిళలు, పదమూడేళ్ల బాలుడు ఉండటం విచారకరం. పాతిక మంది వరకు తీవ్ర గాయాలపాలై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రధాని, గవర్నర్, సిఎం, ప్రముఖుల సంతాపం, సానుభూతి, సందర్శనలు, ఎక్స్‌గ్రేషియా ప్రకటనలు షరా మామూలే. ఆర్‌డిఒ ఆధ్వర్యంలో ముగ్గురు అధికారులతో విచారణ కమిటీ వేశారు. ఈ మధ్యనే వైకుంఠ ఏకాదశి దర్శన టిక్కెట్ల అమ్మకం సందర్భంగా తిరుపతిలో తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. సింహాచలం ఆలయంలో గోడ కూలి ఏడుగురు చనిపోయారు. వాటిపై దర్యాప్తులు ఇంకా ఒక కొలిక్కి రానేలేదు. అంతలోనే కాశీబుగ్గ ఘోరం సంభవించింది. దీనిపై దర్యాప్తు సైతం ప్రత్యేకంగా గతానుభవాలు తెలుపుతున్నాయి.

ఒక ప్రైవేటు వ్యక్తి చేపట్టిన కాశీబుగ్గ కోవెల నిర్మాణం అసంపూర్తిగా ఉండగానే నాలుగు మాసాల క్రితం ప్రారంభమైంది. సోషల్ మీడియాలో అమిత ప్రచారం కల్పించడంతో రోజుకు రెండు వేల మంది వరకు సందర్శకులు వస్తున్నారు. శనివారం మంచి రోజని, ఆ రోజు దేవుడిని దర్శించుకుంటే మోక్షం, ముక్తి, పుణ్యం లభిస్తాయంటూ ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టా వంటి మాధ్యమాల్లో కొంత మంది పనిగట్టుకొని మరీ వైరల్ చేయడంతో పదిహేను వేల మందికిపైన గుడికి వచ్చారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చాక కొన్ని శక్తులు ఒక పథకం ప్రకారం మత మౌఢ్య భావజాలాన్ని ప్రచారం చేయడం ఎక్కువైంది. ఫలాన రోజు ఇన్ని గంటల ఇన్ని నిమిషాలకు ఈ కార్యం తలపెట్టాలని కొంత మంది ప్రవచనకారులు, విశ్లేషకులు తాడుబొంగరం లేని కథలు కాకరకాయలు వ్యాప్తి చేయడంతో జనం నిజమేననుకొని ఎగబడి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. గతంలో రాజమండ్రిలో గోదావరి పుష్కరాల తొలి రోజు తోపులాటలో ముప్పై మంది మరణించడానికి ఈ విధంగా సృష్టించిన ఫోబియా వ్యాప్తి ఒక కారణం. కాశీబుగ్గలోనూ ఇటువంటి ప్రచారమే అమాయకులను బలితీసుకుంది. ఇలాంటి మూఢత్వ ప్రచారాన్ని ప్రభుత్వం నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిర్మాణం పూర్తికాని ఆలయానికి యాత్రికులను అనుమతించడం ప్రభుత్వ తప్పిదం. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ఆశా, అంగన్‌వాడీ, ఇతర చిరుద్యోగులు సమావేశం పెట్టుకుంటామంటేనే పోలీసులు అనుమతి నిరాకరించి ఉక్కుపాదం మోపుతారు. అలాంటిది గుడికి వేలాది మంది పోటెత్తుతారని అంచనా ఎందుకు వేయలేకపోయారు? నిఘా, ఎఐ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఏమైనట్టు? కాశీబుగ్గ ఆలయం లోపల, వెలుపల పోలీస్ బందోబస్తు లేదు. ట్రాఫిక్ నియంత్రణ అసలే లేదు. బారికేడ్లు లేవు. ఒకటవ అంతస్థులో ఉన్న గుడికి వెళ్లడానికి, రావడానికి ఒకే ఒక్క ఇరుకు మెట్లదారే దిక్కు. రైలింగ్ వంటి నిర్మాణాలు చాలా బలహీనంగా ఉన్నాయి. ఇవేమీ ప్రభుత్వ, పోలీస్ దృష్టిలో లేవా? భారీ జన సమూహం గుమిగూడేందుకు ఆస్కారం ఉన్న ప్రార్థనా స్థలాల వంటి రద్దీ, సున్నిత ప్రదేశాల్లో భద్రత, నిర్వహణ చర్యలు ఏమేమి తీసుకోవాలో జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ, జాతీయ భవన నియమావళి మార్గదర్శకాలు ఉన్నాయి. 2011లో శబరిమల, 2024లో హత్రాస్ సహా పలు తొక్కిసలాటల విచారణలో లోపాలు బయటపడ్డాయి. దేశంలో చోటు చేసుకుంటున్న తొక్కిసలాటల్లో 80 శాతం మత కార్యక్రమాలు, తీర్థయాత్రలలోనే సంభవిస్తున్నాయి. వరుసగా మన రాష్ట్రంలోనూ ఇటువంటివి జరుగుతున్నాయి. జనం భారీగా చేరే ప్రదేశాల్లో ఎటువంటి చర్యలు చేపట్టాలో ప్రభుత్వం స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్‌ను రూపొందించి కఠినంగా అమలు చేసి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రజల ప్రాణ భద్రతకు బాధ్యత వహించాలి. కాశీబుగ్గ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలను, క్షతగాత్రులను ప్రభుత్వం ఇతోధికంగా ఆదుకోవాలి. బాధ్యులను శిక్షించాలి.

మహనీయుల మాట



సమాజం కొద్ది మంది మీద ఆధారపడి నడవదు. లేదా అదృష్టం వల్లనో, విధి ఫలితం వల్లనో నడవదు. పౌరుల చైతన్యపూర్వక కార్యాచరణ వల్ల నడుస్తుంది.

- ఆంటోనియో గ్రాంసీ,
ఇటాలియన్ మార్క్సిస్ట్ తత్వవేత్త

Antonio Gramsci

సైనిక బలాన్ని పెంచుకుంటున్న సామ్రాజ్యవాద దేశాలు



ప్రభాత్ పట్నాయక్

ఈ ఏడాది జూన్ నెలలో నెదర్లాండ్స్ దేశంలోని హేగ్ నగరంలో నాటో దేశాల శిఖరాగ్ర సమావేశం జరిగింది. సైనిక వ్యయాలను తమ జిడిపి లో కనీసం 5 శాతానికి తగ్గకుండా ఉండేలా 2035 నాటికి పెంచాలని అక్కడ అన్ని సభ్యదేశాలూ ఒక అంగీకారానికి వచ్చాయి. ప్రస్తుతం అమెరికా సైనిక వ్యయం ఆ దేశపు జిడిపిలో 3.5 శాతం ఉంది. యూరోపియన్ యూనియన్ (ఇ.యు) సైనిక వ్యయం 1.9 శాతం ఉంది. అంటే, రానున్న రోజుల్లో అమెరికా, ఇ.యు దేశాలు తమ సైనిక వ్యయాన్ని గణనీయంగా పెంచబోతున్నాయన్న మాట. ఇక జపాన్ సైనిక వ్యయం ఆ దేశపు జిడిపిలో ఒక శాతానికి మించకుండా గతంలో ఆంక్షలు ఉండేవి. వాటిని క్రమంగా జపాన్ ఉల్లంఘిస్తూ వచ్చింది. తాజాగా ప్రధాని బాధ్యత తీసుకున్న సానే తకైచీ తమ సైనిక వ్యయాన్ని ఇప్పుడున్న 1.8 శాతం నుండి 2 శాతానికి పెంచనున్నట్టు ప్రకటించారు. సామ్రాజ్యవాద దేశాలన్నీ ఈ విధంగా కూడబలుక్కుని తమ సైనిక వ్యయాలను పెంచడానికి పూనుకోవడం సైనికీకరణ వేగం పుంజుకోడానికి దారి తీస్తుంది. ఇది ఒక కొత్త పరిణామం.

తమ సైనికీకరణ వేగాన్ని పెంచుకోడాన్ని సమర్ధించుకుంటూ నానా రకాల వాదనలనూ ముందుకు తెస్తున్నారు. ముఖ్యంగా రష్యా నుండి ప్రమాదం పొంచివుందన్న వాదన చేస్తున్నారు. రష్యా తన సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు పూనుకుందని, ఉక్రెయిన్ ను ఆక్రమించుకోడానికి సాగిస్తున్న యుద్ధం అందులో భాగమేనని సామ్రాజ్యవాదుల ప్రచార సాధనాలు కోడై కూస్తున్నాయి. నిజానికి విస్తరణకు ప్రయత్నాలను ప్రారంభించినదే సామ్రాజ్యవాద కూటమి. గతంలో రష్యా అధ్యక్షుడు గోర్బచేవ్ కు క్లింటన్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తూ రష్యా సరిహద్దు వరకూ ఉన్న దేశాలన్నింటికీ నాటో సభ్యత్వాన్ని ఇచ్చి రష్యాను సైనికపరంగా చుట్టుముట్టింది సామ్రాజ్యవాదులే. ఆ సమయంలో మిన్స్క్ లో జరిగిన సమావేశంలో ఉక్రెయిన్, రష్యా దేశాలు తమ ఉభయుల మధ్యా ఎటువంటి సైనిక ఘర్షణా ఉండకూడదని ఒప్పందం చేసుకోడానికి సిద్ధపడ్డాయి. అప్పటి బ్రిటిష్ ప్రధాని బోరిస్ జాన్సన్ పనిగట్టుకుని ఉక్రెయిన్ రాజధాని కీవ్ కు పయనమై అటువంటి ఒప్పందం చేసుకోవద్దని ఉక్రెయిన్ ను వెనక్కి లాగాడు. ఆ ఒప్పందమే గనుక జరిగివుంటే ఇప్పుడు ఉక్రెయిన్, రష్యాలు ఇలా యుద్ధంలో చిక్కుకునేవే కావు. ఇదంతా సామ్రాజ్యవాదుల కుట్ర. ఎవరు విస్తరణ కాంక్షతో వ్యవహరిస్తున్నారో దీనిని బట్టే అర్థం అవుతోంది. తమ యుద్ధ కాంక్షలను సమర్ధించుకోడానికే ఇప్పుడు వాళ్ళు రష్యా బూచిని సాకుగా చూపిస్తున్నారు.

ఇటువంటి ప్రచారాన్ని యూరప్‌లో ఎవరైనా ప్రశ్నిస్తే వెంటనే వాళ్ళని రష్యన్ ఏజంట్లుగా, పుతిన్ కు తాబేదార్లుగా చిత్రిస్తున్నారు. సహ్రా వేజెన్‌నెక్ట్ జర్మనీలో వామపక్ష నాయకురాలు. డై లింక్ అనే పార్టీ నుండి విడగొట్టుకుని ఇటీవల వేరే పార్టీని ప్రారంభించారు. యూరప్ దేశాల భద్రత రష్యాతో స్నేహం ద్వారా మాత్రమే సాధ్యం అని, రష్యా దురాక్రమణదారు కాదని ఆమె ప్రకటించారు. దాంతో ఆమెను జర్మన్ మీడియా యావత్తూ రష్యన్ ఏజంటుగా ముద్ర వేసి దాడి చేస్తోంది.

నిజానికి యూరప్ దేశాలు రష్యా పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తోంది. రష్యాపై సామ్రాజ్యవాద దేశాలు విధించిన ఆంక్షల ఫలితంగా ఈ దేశాలు అంతవరకూ చౌకగా రష్యా నుంచి వచ్చే చమురు బదులు ఎక్కువ ఖరీదైన అమెరికన్ చమురును బలవంతాన కొనుగోలు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. దాని వలన యూరప్ దేశాల్లో జీవన వ్యయం బాగా పెరిగిపోయింది. కార్మిక వర్గాన్ని అది మరిన్ని భారాల వైపు నెట్టింది. పైగా జర్మనీ వంటి దేశాలు తయారు చేసే ఉత్పత్తుల ఖరీదు పెరిగిపోయింది. ఆ సరుకులు అంతర్జాతీయ పోటీలో నిలబడలేని పరిస్థితి ఏర్పడింది. దానివలన జర్మనీలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి వచ్చింది. ఉన్న పరిశ్రమలే మూతవేసుకోవలసిన పరిస్థితి వచ్చింది. ఈ ఆంక్షల వలన అమెరికా తన చమురును మరింత ఎక్కువగా యూరప్‌కు అమ్ముకోగలిగింది. కాని యూరప్ దేశాలకు నష్టమే కలిగింది. అయినప్పటికీ అవి తమ స్వంత ప్రయోజనాలను బలి చేసుకుంటూ అమెరికా ఆంక్షలను వ్యతిరేకించకుండా పూర్తిగా లొంగిపోవడం విచిత్రం.

ఇటువంటి పరిస్థితి ఏర్పడడానికి ఒక కారణం ఇప్పుడు యూరప్ దేశాల ప్రభుత్వాలకు నాయకత్వం వహిస్తున్న శక్తులే. ఈ నాయకుల్లో ఎక్కువమంది పెట్టుబడిదారులే. వారంతా అమెరికన్ పెట్టుబడిదారీ వ్యవస్థతో సన్నిహితంగా పెనువేసుకుని వున్నవారే. ఉదాహరణకు: అమెరికన్ బహుళజాతి పెట్టుబడుల కంపెనీ అయిన బ్లాక్‌రాక్ కు అనుబంధం గా ఉన్న జర్మన్ సంస్థ బోర్డుకు చైర్మన్‌గా వ్యవహరించిన ఫ్రెడరిక్ మెర్జ్ ఇప్పుడు జర్మనీ చాన్సలర్‌గా ఉన్నాడు. ఇప్పుడున్న యూరోపియన్ దేశాల నాయకత్వం అమెరికన్ వ్యాపార ప్రయోజనాలను వ్యతిరేకించి యూరోపియన్ దేశాల ప్రయోజనాలను సంరక్షించగల స్థితిలో లేదు. గతంలో చార్లెస్ డి గాల్ (ఫ్రాన్స్), విల్లీ బ్రాండ్ట్ (జర్మనీ) వంటి నాయకులు తమ తమ దేశాల ప్రయోజనాల కోసం అమెరికాతో తలపడగలిగారు. ఇప్పటి యూరోపియన్ నాయకులలో అటువంటి తెగువ లేదు.

> **ఇప్పుడు సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న వ్యూహంలో మూడు అంశాలు ఉన్నాయి. మొదటిది: అన్ని దేశాల్లోనూ నయా ఫాసిస్టు ప్రభుత్వాల ఏర్పాటును ప్రోత్సహించడం. ప్రత్యేకించి మూడవ ప్రపంచ దేశాలలో ఈ ప్రోత్సాహం ఎక్కువగా ఉంటుంది. రెండవది: సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వెలుపల ఒక ప్రత్యామ్నాయ కూటమిగా జరుగుతున్న ఏర్పాటు నుంచి దూరంగా ఉండడం, వీలైతే అటువంటి ఏర్పాటుకు కుట్రపూరితంగా ద్రోహం చేయడం కోసం ఈ నయా ఫాసిస్టు ప్రభుత్వాలను ఉపయోగించడం (ప్రస్తుతం మోడీ ప్రభుత్వం మీద ట్రంప్ తెస్తున్న ఒత్తిడి ఈ వ్యూహంలో భాగమే). మూడవది: తమకు లొంగి వుండేలా తొత్తు ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో విఫలమైతే అటువంటి దేశాలమీద సైనిక శక్తిని ప్రయోగించి వాటిలో జోక్యం చేసుకోవడం.**

అయితే, యూరోపియన్ దేశాలు ఇప్పుడు ఆర్థికంగా చేసుకుంటున్న ఆత్మహత్య వైనాన్ని ఇదొక్కటే వివరించలేదు. రష్యాలో ఇప్పుడున్న ప్రభుత్వాన్ని కూలదోసేవరకూ ఎలాగైనా ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని కొనసాగించి రష్యాలో కూడా ఉక్రెయిన్‌లో మాదిరిగానే తమ తాబేదారులను అధికారంలో కూర్చోబెడితే అప్పుడు అమెరికాకు, యూరప్ దేశాలకు రష్యాలో ఉన్న అపారమైన సహజ సంపద అంతా చేజిక్కుతుంది. ఇప్పుడు చైనా, ఇరాన్ తదితర దేశాలతో కూటమిగా వ్యవహరిస్తున్న రష్యాను దెబ్బ తీయగలిగితే, పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదపు పెత్తనానికి ఆ కూటమి నుండి ఎందురౌతున్న సవాలు బలహీన పడుతుంది. ఇదే సామ్రాజ్యవాదుల అసలు కుతంత్రం.

మరోపక్క డొనాల్డ్ ట్రంప్ వెనిజులాలో కూడా ఎలాగైనా సైనిక జోక్యం చేసుకోవాలని, అక్కడ తమ తొత్తు ప్రభుత్వాన్ని నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నాడు. ఇందుకోసం అక్కడ ఉన్న వామపక్ష అధ్యక్షుడు నికొలస్ మదురోను "మాదకద్రవ్యాల రవాణా చేసే ఉగ్రవాది" అని, మాదక ద్రవ్యాల వ్యాపారుల ముఠాకు నాయకుడు అని ముద్ర వేసి అప్రదిష్టపాలు చేసే ప్రచారానికి స్వయంగా ట్రంప్ పాల్పడ్డాడు. నిజానికి విక్టర్ హ్యూగో చావెజ్‌కు, బొలివేరియన్ విప్లవ స్ఫూర్తికి వారసుడిగా అక్కడ మదురో ఉన్నాడు. అయినా సరే ట్రంప్ ఇటువంటి తప్పుడు ప్రచారానికి దిగాడు. వెనిజులా కూడా సహజ వనరులు సమృద్ధిగా ఉన్న దేశం. దానికి తోడు సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని సవాలు చేస్తున్న బ్రిక్స్ కూటమితో వెనిజులా కలిసి వ్యవహరిస్తోంది. అందుకే ట్రంప్ ఈ కుట్రకు పాల్పడుతున్నాడు.

ఇలా ఆ యా దేశాల ప్రభుత్వాలను కుట్రపూరితంగా కూలదోసి తమ తొత్తులను అక్కడ కూర్చోబెట్టే కుట్ర ఇక్కడితో ఆగలేదు. కొలంబియా లో అధ్యక్షుడిగా ఎన్నికైన వామపక్ష నేత గుస్తావో పెట్రోను కూడా "మాదక ద్రవ్యాల వ్యాపారి" అని ముద్ర వేశాడు ట్రంప్. దానిని రుజువు చేసే చిన్నపాటి సాక్ష్యం కూడా చూపలేదు. ఇక్కడ గనుక ట్రంప్ ప్రభుత్వాలను కూలదోయడంలో విజయం సాధిస్తే మొత్తం లాటిన్ అమెరికా లోని అన్ని దేశాలలోనూ తన తొత్తులను అధికార పీఠం ఎక్కించేందుకు ట్రంప్‌కి ధైర్యం వస్తుంది. ట్రంప్ కుట్రకు క్యూబా కూడా మినహాయింపు కాదు.

సామ్రాజ్యవాద దేశాలు సాగిస్తున్న సైనికీకరణ తమ దేశాల భద్రతకు ముప్పు వాటిల్లినందువలన కాదు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ తమకు లొంగి పడివుండే ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం సామ్రాజ్యవాదుల లక్ష్యం. ఆ లక్ష్యాన్ని నెరవేర్చుకోడానికి అడ్డుగా నిలబడ్డ ఏ దేశంలోని ప్రభుత్వం మీదనైనా సైనిక పరంగా దాడులకు పూనుకోడానికే ఇప్పుడు సైనికీకరణ వేగం పెంచుతున్నారు. సామ్రాజ్యవాద ఆధిపత్యానికి ఏ దేశం నుండీ ఎటువంటి సైనికపరమైన ప్రమాదమూ లేదు. ఉన్నదల్లా సామ్రాజ్యవాదుల ఆర్థిక, రాజకీయ ఆధిపత్యానికి సవాలు మాత్రమే. ఈ సవాలు విసురుతున్న దేశాలలోని ప్రభుత్వాలను వెంటనే కూలదోయకపోతే వాటిని ఆర్థికంగా, రాజకీయంగా ఎదుర్కొనే శక్తి సామ్రాజ్యవాదులకు సన్నగిల్లిపోవచ్చు. అదే సామ్రాజ్యవాదుల అసలు భయం.

> **సామ్రాజ్యవాద ఆధిపత్యానికి ఏ దేశం నుండీ ఎటువంటి సైనికపరమైన ప్రమాదమూ లేదు. ఉన్నదల్లా సామ్రాజ్యవాదుల ఆర్థిక, రాజకీయ ఆధిపత్యానికి సవాలు మాత్రమే. ఈ సవాలు విసురుతున్న దేశాలలోని ప్రభుత్వాలను వెంటనే కూలదోయకపోతే వాటిని ఆర్థికంగా, రాజకీయంగా ఎదుర్కొనే శక్తి సామ్రాజ్యవాదులకు సన్నగిల్లిపోవచ్చు. అదే సామ్రాజ్యవాదుల అసలు భయం.**

ఈ భయానికి కారణం సామ్రాజ్యవాదులు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలే. ఇప్పుడు ఆ నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థకు ముందు దారి లేకుండా మూసుకు పోయింది. నయా ఉదారవాద చట్రాన్ని బద్దలుగొట్టి దాన్నుండి బైటపడకుండా ముందు దారి ఏర్పడడం అసాధ్యం. రెండో ప్రపంచ యుద్ధం అనంతర కాలంలో అతి తక్కువ వృద్ధిరేటు నమోదైనది గత దశాబ్ద (2012-21) కాలంలోనే. ఇప్పుడు తమను ఉద్ధరిస్తుందని వీళ్ళు ఆశలు పెట్టుకున్న ఎఐ బుడగ కాస్తా పేలిపోతే అమెరికన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం ఖాయం. ఆ ఎఐ కారణంగా పెరిగిపోయే నిరుద్యోగం ఇప్పుడున్న నిరుద్యోగానికి అదనంగా తోడవుతుంది.

ఈ నిరుద్యోగం వలన ఎక్కువగా దెబ్బ తినబోయేది మూడవ ప్రపంచ దేశాల ప్రజలు. దానికి ట్రంప్ సుంకాల యుద్ధం తోడైంది. పొరుగు దేశాలను బిచ్చగాళ్ళుగా దిగజార్చి తాను మాత్రం బాగుపడి పోవాలనుకునే ట్రంప్ విధానాలు మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను దారుణంగా దెబ్బ తీస్తున్నాయి. సామ్రాజ్యవాద దేశాలు తమ తమ మధ్య పరస్పరం ఆమోదయోగ్యంగా ఉండే విధంగా ఈ సుంకాల వ్యవస్థను సర్దుబాటు చేసుకుంటున్నాయి. కాని మూడవ ప్రపంచ దేశాలు మాత్రం తమ సుంకాలను తగ్గించుకుని మరీ అమెరికన్ దిగుమతులను తెచ్చుకోవలసి వస్తోంది. అమెరికా విధించే అధిక సుంకాల కారణంగా వాటి ఎగుమతులు బాగా దెబ్బ తినిపోనున్నాయి.

ఇదంతా మొత్తంగా మూడవ ప్రపంచ దేశాలను మరింత దుర్భర స్థితిలోకి నెడుతోంది. ఆ కారణంగానే సామ్రాజ్యవాదుల పెత్తనం కింద నడిచే ఆర్థిక ఒప్పందాల వ్యవస్థ నుండి బైటపడి ప్రత్యామ్నాయంగా వేరే వ్యవస్థ వైపు మళ్ళాలన్న ఒత్తిడులు కూడా మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాల మీద దిగువ నుండి పెరుగుతున్నాయి. ఇంతరవకూ బ్రిక్స్ వంటి కూటములు ప్రత్యక్షంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పాత్రను పోషించి వుండకపోవచ్చు. కాని రానున్న రోజుల్లో మూడవ ప్రపంచ దేశాలు మరింత దుర్భర పరిస్థితుల్లోకి జారిపోతున్న కొద్దీ ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను చేపట్టగల ప్రభుత్వాలను ఏర్పాటు చేయగల అవకాశాలు పెరుగుతాయి. అటువంటి ప్రభుత్వాలు మాత్రమే ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరచగలుగుతాయి.

ఇప్పుడు సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న వ్యూహంలో మూడు అంశాలు ఉన్నాయి. మొదటిది: అన్ని దేశాల్లోనూ నయా ఫాసిస్టు ప్రభుత్వాల ఏర్పాటును ప్రోత్సహించడం. ప్రత్యేకించి మూడవ ప్రపంచ దేశాలలో ఈ ప్రోత్సాహం ఎక్కువగా ఉంటుంది. రెండవది: సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వెలుపల ఒక ప్రత్యామ్నాయ కూటమిగా జరుగుతున్న ఏర్పాటు నుంచి దూరంగా ఉండడం, వీలైతే అటువంటి ఏర్పాటుకు కుట్రపూరితంగా ద్రోహం చేయడం కోసం ఈ నయా ఫాసిస్టు ప్రభుత్వాలను ఉపయోగించడం (ప్రస్తుతం మోడీ ప్రభుత్వం మీద ట్రంప్ తెస్తున్న ఒత్తిడి ఈ వ్యూహంలో భాగమే). మూడవది: తమకు లొంగి వుండేలా తొత్తు ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో విఫలమైతే అటువంటి దేశాలమీద సైనిక శక్తిని ప్రయోగించి వాటిలో జోక్యం చేసుకోవడం.

నయా ఉదారవాద విధానాల పర్యవసానంగా తలెత్తిన సంక్షోభంతో సామ్రాజ్యవాదం ఒక మూలకు నెట్టబడింది. ఈ నయా ఉదారవాద చట్రం లోపలనే ఈ సంక్షోభం పరిష్కారం అయ్యే పరిస్థితి లేదు. అందుచేత సైనికపరంగానైనా సరే మూడవ ప్రపంచ దేశాల మీద తెగబడి వాటిని తమకు లొంగి వుండేలా చేసుకోడానికే అవి సిద్ధపడుతున్నాయి. పెరుగుతున్న సామ్రాజ్యవాద సైనికీకరణ దీనినే సూచిస్తోంది.

(స్వేచ్ఛానుసరణ)



వ్యాఖ్య

భూమి గుంజుకోవడమే...ఉపాధి ఏదీ?



వి. వెంకటేశ్వర్లు

దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా వివిధ సంస్థల నుంచి భారీ పెట్టుబడులు మన రాష్ట్రానికి వస్తున్నాయని ముఖ్యమంత్రి గారు ప్రకటించడం ఆనందదాయకమైన విషయం. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చెందబోతున్నదని ప్రచార మాధ్యమాలలో కూడా మారుమోగుతోంది.

గడిచిన పదేళ్లలో గత తెలుగుదేశం, వైసిపి, నేటి కూటమి ప్రభుత్వాలు 11 సార్లు విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారుల సమావేశాలు, సమ్మిట్లు, విదేశీ పర్యటనలు జరిపి 20 నుండి 30 లక్షల మంది యువతీ యువకులకు ఉద్యోగాలు వస్తాయని, పరోక్షంగా మరో 20 లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని చెప్పాయి. మరి ఈ దశాబ్ద కాలంలో ఎంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాయో ప్రభుత్వం స్పష్టంగా తెలియజేస్తే అభివృద్ధి బండారం బయట పడుతుంది. కానీ గడిచిన పదేళ్లలో నిరుద్యోగం, పేదరికం రైతు కూలీల ఆత్మహత్యలు అత్యధికంగా జరుగుతున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి.


వివిధ ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చి సర్వం త్యాగం చేసిన రైతులకు నేటికీ పరిహారం అందక, మరోపక్క భూములు కోల్పోయి వీధిన పడ్డారు. లక్షలాది రైతు కూలీలు, కౌలుదారులు ఉపాధి కోల్పోయి వలసలు పోతున్నారు. గత పదేళ్లుగా రాష్ట్రంలో సోలార్, పోర్టులు, రిజర్వాయర్లు, ప్రైవేటు పరిశ్రమలు, హైవేలు, పారిశ్రామిక కారిడార్లు, జిందాల్ స్టీల్ ప్లాంట్లు, ఫార్మాసూటికల్స్, కియా, ఎస్‌ఇజడ్, బిపిసిఎల్, విమానాశ్రయాలు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, రైల్వే లైన్లు, పెట్రో యూనివర్సిటీలు, బల్క్ డ్రగ్స్, మైనింగ్, రాజధాని 15 రకాల ప్రాజెక్టుల పేరు చెప్పి 21 జిల్లాల్లో సుమారు 102 మండలాల్లో 200 పైగా గ్రామాలలో 3,08,970 ఎకరాల పంట భూములు ప్రభుత్వాలు రైతుల నుండి బలవంతంగా లాక్కున్నాయి.

ప్రభుత్వం రైతుల నుండి తీసుకున్న భూములను మార్కెట్ రేటు ప్రకారం సగటున ఎకరాకు 30 లక్షల రుపాయల చొప్పున లెక్కించిన 3,08,970 ఎకరాలకు సుమారు 9 లక్షల 26 వేల కోట్ల రుపాయలు ఉంటుంది. ఇన్ని లక్షల కోట్ల విలువైన భూములను తీసుకొని...చదువుకున్న యువతీ యువకులకు కల్పించిన ఉద్యోగాలు నామమాత్రమే. వీరికి వస్తున్న వేతనం కూడా రూ.20 వేల నుండి రూ.50 వేలకు మించి లేదు. అసంఘటిత రంగంలో ఉపాధి కల్పించింది కేవలం 98,950 వేల మందికి మాత్రమే. రోజుకు వీరికిచ్చే వేతనం రూ.400 నుండి రూ.600 మించి లేదు. అది కూడా ఆఫీస్ బాయ్‌లుగాను, బాత్‌రూమ్ క్లీనర్లు, సెక్యూరిటీ గార్డులు, తోటమాలీలు, హమాలీ వర్కర్లుగా పనులు చూపించి లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నామని అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు.

పై భూములే కాకుండా గత మూడు నాలుగేళ్లుగా వైసిపి, నేటి తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు అభివృద్ధి అనే ముద్దు పేరుతో 62 మండలాల్లో 170 గ్రామాలలో సుమారు 2,22,500 ఎకరాల భూములు సేకరించడానికి పూనుకున్నారు. వీటిలో కరేడు, కుప్పం, నక్కపల్లి, అన్నేమడుగు, జీలుగుమిల్లి, పెనుగొండ ప్రాంతాలలో సారవంతమైన రెండు, మూడు పంటలు పండే భూములు బలవంతంగా తీసుకొనడానికి నోటీసులు ఇచ్చారు. ప్రశ్నించిన రైతులను బయటికి రాకుండా 30 సెక్షన్ పెట్టి ఉల్లంఘించిన వారిపై కేసులు, వీరికి అండగా ఉంటున్న వామపక్ష పార్టీ ప్రజాసంఘాల నాయకులను ఆ ప్రాంతాలకు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. ప్రభుత్వాలు మారాయి గాని విధానాల్లో ఎటువంటి మార్పులు లేదు.

ఉదాహరణకు రాయలసీమ ప్రాంతంలో ఆసియాలోని అతి పెద్ద సోలార్‌గా చెప్పుకునే ఓర్వకల్లు, ఎన్‌పి కుంట మండలాలలో సుమారు 15 వేల ఎకరాలు తీసుకున్నారు. ఇందులో కనీసం 500 మందికి కూడా స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వలేదు. విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రాంతంలో సుమారు 3500 ఎకరాలు జిందాల్ స్టీల్‌ప్లాంట్ మరియు పరిశ్రమల కోసం 3500 ఎకరాలు తీసుకున్నారు. దశాబ్ద కాలం దాటినా నేటికీ పనులు ప్రారంభించలేదు. పోగా ఇందులో వెయ్యి ఎకరాలను బ్యాంకులో తాకట్టు పెట్టి వందల కోట్లు కొల్లగొట్టారని వార్తలు వస్తున్నాయి. అదే విధంగా ఈ భూములన్ని బీళ్లుగా మారాయి. రైతులకు ఆ భూములు తిరిగి ఇవ్వాలని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో గడిచిన కాలంలో 25 వేల 134 ఎకరాలు తీసుకున్నారు ఉపాధి చూపింది కేవలం 1000 మందికి మించి లేదు. నిర్మాణ పనులకు అసంఘటిత రంగంలో 65 వేల మందికి పని చూపించామని చెప్తే వీరిలో స్థానికులకు ఇచ్చింది కేవలం 15 వేలకు మించి లేదు. మిగిలిన 50 వేల మంది పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన వారే. ప్రకాశం జిల్లాలో నిమ్స్, వివిధ పరిశ్రమలు, దొనకొండ కారిడార్ పేరుతో 16,938 ఎకరాలు తీసుకున్నారు. నెల్లూరు జిల్లాలో ఆరు రకాల ప్రాజెక్టుల పేరుతో సుమారు 50 వేల ఎకరాలు పైగా తీసుకున్నారు. ఇందులో నేటికీ 22,830 ఎకరాలలో ఎటువంటి ప్రాజెక్టులు ప్రారంభించలేదు. సత్యసాయి జిల్లాలో 35 వేల ఎకరాలు తీసుకున్నారు. ఉద్యోగాలు ఇచ్చింది 4 వేలకు మించి లేదు. నేటికీ 15 వేల ఎకరాల భూమి ఖాళీగా ఉంది. 8 వేల ఎకరాలను బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ. వేల కోట్లు దండుకున్నారు. ఇప్పటివరకు చేపట్టిన కృష్ణపట్నం లాంటి పోర్టులలో కూడా స్థానికులకు కల్పించిన ఉద్యోగాలు అతి తక్కువ. గత పదేళ్ళలో అభివృద్ధి పేరుతో తీసుకున్న భూములు 3,08,970 ఎకరాలు. తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నది 2,22,500 ఎకరాలు. మొత్తం 5,31,470 ఎకరాలు. మార్కెట్ రేటు ప్రకారం సుమారు 16 లక్షల కోట్ల విలువైన భూములను ఈ పాలకులు అభివృద్ధి అనే ముద్దు పేరుతో కార్పొరేట్ అనే పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తున్నారు. కాబట్టి రాష్ట్రంలో గడిచిన 10 సంవత్సరాలలో ఎన్ని భూములు తీసుకున్నారు? ఎన్ని పరిశ్రమలు పెట్టారు? ఎంతమంది స్థానికులకు ఉద్యోగాలు కల్పించారో పాలకులే సెలవివ్వాలి.

> **సత్యసాయి జిల్లాలో 35 వేల ఎకరాలు తీసుకున్నారు. ఉద్యోగాలు ఇచ్చింది 4 వేలకు మించి లేదు. నేటికీ 15 వేల ఎకరాల భూమి ఖాళీగా ఉంది. 8 వేల ఎకరాలను బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ. వేల కోట్లు దండుకున్నారు. ఇప్పటివరకు చేపట్టిన కృష్ణపట్నం లాంటి పోర్టులలో కూడా స్థానికులకు కల్పించిన ఉద్యోగాలు అతి తక్కువ. గత పదేళ్ళలో అభివృద్ధి పేరుతో తీసుకున్న భూములు 3,08,970 ఎకరాలు. తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నది 2,22,500 ఎకరాలు. మొత్తం 5,31,470 ఎకరాలు. మార్కెట్ రేటు ప్రకారం సుమారు 16 లక్షల కోట్ల విలువైన భూములను ఈ పాలకులు అభివృద్ధి అనే ముద్దు పేరుతో కార్పొరేట్ అనే పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తున్నారు. కాబట్టి రాష్ట్రంలో గడిచిన 10 సంవత్సరాలలో ఎన్ని భూములు తీసుకున్నారు? ఎన్ని పరిశ్రమలు పెట్టారు? ఎంతమంది స్థానికులకు ఉద్యోగాలు కల్పించారో పాలకులే సెలవివ్వాలి.**



/ వ్యాసకర్త ఎ.పి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెల్:9490098980 /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

మహిళా క్రికెటర్ల నయా చరిత్ర

హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీలో తొలిసారి ఐసిసి ట్రోఫీ



ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న భారత మహిళా క్రికెటర్లకు ఈ ట్రోఫీ కైవసం మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. ఆదివారం జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికా మహిళలపై 52పరుగుల తేడాతో భారతజట్టు ఘన విజయం సాధించి చరిత్రలో తొలిసారి ఒక ఐసిసి ట్రోఫీని ముద్దాడింది. 1973నుంచి జరుగుతున్న వన్డే మహిళల క్రికెట్‌లో భారతజట్టు సెమీస్‌కు చేరడమే గొప్ప అనుకుంటే.. 2005, 2017లలో ఫైనల్‌కు చేరి ప్రపంచ క్రీడాభిమానులు ఒకసారి తమవైపు తిరిగి చూసే ప్రదర్శనతో అదరగొట్టింది. అలాంటిది ఈసారి టోర్నీ ప్రారంభం మ్యాచుల్లో రెండు గెలిచి ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచుల్లో ఓడి క్రీడాభిమానులను నిరాత్సాహానికి గురిచేసింది. ఈ క్రమంలో అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ ఏకంగా టైటిల్‌ను కొట్టి శెభాష్.. అనిపించుకుంది.

మహిళల క్రికెట్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ ఆ తర్వాత న్యూజిలాండ్ జట్లదే ఆధిపత్యం. టి20 ఫార్మాట్‌లో అప్పుడప్పుడు దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ మెరుస్తున్నా.. అంతిమ విజయం ఆ జట్లదే. వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ భారత మహిళల జట్టు చరిత్రలో తొలిసారి ఒక ఐసిసి ట్రోఫీని ముద్దాడింది. ఈ విజయం టీమిండియాకు ఆషామాషీగా ఏం దక్కలేదు. సెమీస్‌లో ఏడుసార్లు ఛాంపియన్, డిఫెండింగ్ ఛాంపియన్‌తో పోటీపడాల్సి వచ్చింది. ఆ అడ్డంకిని తొలగించుకొని ఫైనల్‌కు చేరినా.. లీగ్‌లో సఫారీల చేతిలో ఓటమిపాలైన జట్టుతో టైటిల్ పోరు. ఆ జట్టులో ఏ దశలో ఎలా ఆడుతుందో ఎవరూ ఊహించలేదు. అయినా ఆ జట్టును ఓడించి బదులు తీర్చుకోవడంతోపాటు 42ఏళ్ల తర్వాత భారత మహిళలజట్టు తొలిసారి ఐసిసి వన్డే ప్రపంచకప్‌ను కొట్టడం విశేషం. టీమిండియా గెలుపులో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పాత్ర మరువలేనిది.

హర్మన్ ప్రీత్ సారథ్యంలో...

దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలుకుతూ హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ప్రపంచ కప్ ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. డయానా ఎడుజి, అంజుమ్ చోప్రా, మిథాలీ రాజ్.. వంటి దిగ్గజ కెప్టెన్లకు సాధ్యంకాని కప్‌ను దేశానికి అందించింది. మహిళా క్రికెట్‌లో సువర్ణాధ్యాయంగా సొంతగడ్డపై టీమిండియాకు కలల ట్రోఫీని కట్టబెట్టిన ఈ పంజాబీ అమ్మాయి ఇది ఆరంభం మాత్రమే అని పేర్కొంది. 16 ఏళ్ల కెరీర్లోనే హర్మన్‌ప్రీత్ వరల్డ్ కప్ ఛాంపియన్‌గా నిలిచింది. లీగ్ దశలో వరుసగా మూడు ఓటముల నుంచి తేరుకొని జట్టును విజయపథాన నడిపించింది. సెమీస్‌లో ఆస్ట్రేలియాపై 89 పరుగులతో మెరిసింది. ఫైనల్లో 20 పరుగులే చేసింది. ఈ క్రమంలో వరల్డ్ కప్ నాకౌట్స్‌లో అత్యధిక పరుగుల రికార్డును సొంతం చేసుకుంది. ఆస్ట్రేలియా వెటరన్ బెలిండా క్లార్క్ 6 ఇన్నింగ్స్‌ల్లో 330 రన్స్‌తో నెలకొల్పిన రికార్డును కౌర్ బ్రేక్ చేసింది. భారత కెప్టెన్ కేవలం నాలుగు ఇన్నింగ్స్‌ల్లోనే 331పరుగులు చేయడం విశేషం. తన వ్యూహాత్మక నిర్ణయాలతో దక్షిణాఫ్రికాను దెబ్బతీసింది. ప్రత్యర్థి బ్యాటర్లను క్రీజ్‌లో కుదురుకోనివ్వకుండా పార్ట్‌టైమ్ బౌలర్ షఫాలీ వర్మకు సైతం బంతి అందించి అందర్నీ ఆశ్చర్యపరిచింది. దీప్తి శర్మ ఓవర్లో డీక్లెర్క్ కొట్టిన బంతిని వెనక్కి పరుగెడుతూ క్యాచ్ పట్టిన హర్మన్‌ప్రీత్.. 'మేము సాధించాం' అంటూ సహచరులతో గెలుపు సంబరాలు చేసుకుంది.

- స్పోర్ట్స్ డెస్క్

రేణుకా సింగ్, క్రాంతి గాడ్‌లకు రూ.కోటి నజరానా



ముంబయి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఫాస్ట్ బౌలర్ రేణుకా సింగ్ ఠాకూర్, క్రాంతి గాడ్‌లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కోటి రూపాయల నజరానాను ప్రకటించాయి. హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం రేణుకా సింగ్‌కు, మధ్యప్రదేశ్ ప్రభుత్వం క్రాంతి గాడ్‌లకు ఈ నజరానా ప్రకటించాయి. రూ.కోటి పారితోషకాన్ని ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు సోమవారం ఈ నజరానాను ప్రకటించారు. రేణుకా ప్రతి పర్వతప్రాంతం అమ్మాయి కలను నెరవేర్చిందని, రేణుక ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగం కావడం దేశానికి, హిమాచల్‌కు గర్వకారణమన్నారు. అలాగే ప్రపంచ కప్‌లో రేణుక ప్రదర్శనను కూడా ముఖ్యమంత్రి ప్రశంసించారు. యువ పేసర్ క్రాంతి గౌడ్‌కు మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూ.కోటి నజరానా ప్రకటించింది. 22ఏళ్ల యువ బౌలర్ ఎనిమిది మ్యాచుల్లో 5.73 ఎకానమీ రేటుతో బౌలింగ్ చేస్తూ తొమ్మిది వికెట్లు పడగొట్టింది. మెగా ఈవెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చినందుకు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ భారత జట్టుకు అభినందనలు తెలిపారు. క్రాంతి గౌడ్ మహిళల ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగమైనందున సత్కరించాలనుకుంటున్నానని.. ప్రభుత్వం తరఫున రూ.కోటి ప్రోత్సాహకాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఆమె ఛతర్‌పూర్, మధ్యప్రదేశ్‌కు గర్వకారణంగా నిలిచిందని.. భారత క్రికెటర్లు ప్రపంచవేదికపై భారతదేశం గర్వపడేలా చేశారన్నారు. పాకిస్తాన్‌తో జరిగిన హై వోల్టేజ్ మ్యాచ్‌లో పది ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసింది. ఆ మ్యాచ్‌లో భారత జట్టు 88 పరుగుల తేడాతో గెలిచింది. అద్భుత బౌలింగ్ ప్రదర్శనకు ఆ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకుంది.

అవినీతిపై నివేదిక కోరిన హౌస్ కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆప్కాబ్, జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో అవినీతికి సంబంధించి పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి తదుపరి సమావేశం నాటికి అందజేయాలని శాసనసభ హౌస్ కమిటీ వ్యవసాయ, సహకార శాఖల అధికారులను ఆదేశించింది. శాసనసభ కమిటీ హాలులో హౌస్ కమిటీ సమావేశం ఛైర్మన్ ఎన్ అమరనాథ్ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, యార్లగడ్డ వెంకట్రావు, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, బొలిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆప్కాబ్, డిసిసిబిల్లో అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై చర్చించారు.

వన్డేల్లో అమెరికా ఆల్‌రౌండర్ మిలింద్ రికార్డు సెంచరీ

21మ్యాచుల్లో 1,016పరుగులు

న్యూయార్క్: అమెరికా క్రికెటర్ మిలింద్ కుమార్ రికార్డు సెంచరీతో మెరిసాడు. కేవలం 21 మ్యాచుల్లో 67.73సగటులో 1,016పరుగులు చేశాడు. అలాగే కేవలం 21 వన్డేల్లోనే మూడో శతకంతో మెరిసాడు. అమెరికా తరఫున ఈ సగటు సాధించిన తొలి క్రికెటర్‌గా మిలింద్ నిలిచాడు. ఐసిసి క్రికెట్ ప్రపంచకప్ లీగ్-2లో భాగంగా యుఎఇతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో మిలింద్ రికార్డు సెంచీతో రాణించాడు. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన అమెరికా జట్టు 50ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 292 పరుగులు చేసింది. మిలింద్ కుమార్(139; 149బంతుల్లో 10ఫోర్లు, 3సిక్సర్లు), సాయితేజ(123; 125బంతుల్లో 11ఫోర్లు, సిక్సర్) అజేయ సెంచరీలతో రాణించారు. అలాగే వీరిద్దరూ 4వ వికెట్‌కు 264 పరుగుల రికార్డును నెలకొల్పారు. ఇక 4వ వికెట్‌కు 1998లో జింబాబ్వేపై భారత ఆటగాళ్లు అజారుద్దీన్-జడేజా కలిసి 275పరుగుల రికార్డును బ్రేక్ చేయలేకపోయారు. వీరిద్దరూ రాణించడంతో అప్పట్లో భారతజట్టు 26/3నుంచి 301/3కు చేరింది.

దళితులపై మారణాయుధాలతో దాడి

- పోలీసుల ఎదుటే దాష్టీకం
- పలువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- చీమకుర్తి (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం బండ్లమూడి దళిత కాలనీలో దళితులను అదే గ్రామానికి చెందిన పెత్తందారులు మారణాయుధాలతో దాడి చేసి గాయపర్చారు. పోలీసుల ఎదుటే ఈ చర్యకు పాల్పడ్డారు. అయినా, పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం, బాధితులపైనా కేసు నమోదు చేయడం విమర్శలకు తావిస్తోంది. బాధితుల కథనం ప్రకారం... బండ్లమూరి దళిత కాలనీకి చెందిన దళితుల భూముల్లో సరుగుడు మొక్కలను ఆదివారం అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి, బాలఓబుల్‌రెడ్డిలకు చెందిన గొర్రెలు మేశాయి. దీనిపై దళితులు ప్రశ్నించినందుకు రెండు గ్రూపుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. సోమవారం ఉదయం దళిత కాలనీ చెందిన వారు దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో, విచారించడానికి గ్రామానికి పోలీసులు మధ్యాహ్నం వెళ్లారు. 'మా మీదనే కేసు పెట్టి పోలీసులను తీసుకొస్తారా?' అంటూ శ్రీనివాసులరెడ్డి, బాలఓబులరెడ్డి నేతృత్వంలో దాదాపు 50 మంది కర్రలు, మారణాయుధాలతో పోలీసుల ఎదుటే దళితులను ఇష్టారీతిన కొట్టారు. ఈ దాడిలో దళితులు కంఠం ఏసుదాసు, కంఠం రామయ్య, యోసోబు, ఎలిసెమ్మ, కోటయ్య, యెహూషువాలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దళితుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అయితే, బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు ఇరుగ్రూపులపై కేసు నమోదు చేయడం విమర్శలకు తావిస్తోంది.


దాడిలో గాయపడిన మహిళ

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం

ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత దళితులను కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురాం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు పరామర్శించారు. బాధితులపై దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే వారిని అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బండ్లమూడి దళిత కాలనీని జిల్లా కలెక్టర్, ఎస్‌సి కమిషన్ ఛైర్మన్, జిల్లా ఎస్‌పి సందర్శించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

దళితులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, బండ్లమూడి గ్రామంలో దళితులపై దాడికి పాల్పడ్డ కుల దురహంకారులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. హోంమంత్రి, రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ ఆ గ్రామాన్ని సందర్శించి బాధితులకు న్యాయం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

శ్రీనివాసరెడ్డికి చెందిన గొర్రెలు.. మాదిగల పంటను ధ్వంసం చేశాయని, దీనిపై బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. విచారణకు వచ్చిన పోలీసుల సమక్షంలోనే బాధితులపై మారణాయుధాలతో దాడి చేయడం దుర్మార్గమైన కులదురహంకార చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వమే నిందితులపై తక్షణం కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, కఠినంగా శిక్షించాలని కోరారు. దాడిలో గాయాలపాలైన దళితులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. గతంలోనూ ఈ గ్రామంలో ఎస్‌సిలపై దాడులు జరిగాయని, అన్నీ దృష్టిలో ఉంచుకుని బాధిత గ్రామాన్ని జిల్లా కలెక్టరు, ఎస్‌పి సందర్శించి బాధితులకు భరోసా కల్పించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్తుత్తి విచారణేనా?

- హడావుడిగా విచారణ కమిటీ
- ప్రత్యక్ష సాక్షులను స్టేషన్‌కు పిలిచి పోలీసుల విచారణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

పలాస ఆలయ దుర్ఘటనపై ప్రభుత్వం వేసిన విచారణ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించకుండా తమ విధుల్లో తలమునకలైపోయింది. దీంతో విచారణ ఉత్తుత్తిదేనని పలువురు చర్చించుకుంటున్నారు. కాశీబుగ్గలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల ఒకటో తేదీన జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది చనిపోగా, పదుల సంఖ్యలో గాయపడిన సంగతి తెలిసిందే. దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అప్పటికప్పుడు ఒక విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీలో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, ఎఎస్‌పి కె.వి రమణ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ ఉన్నారు. అయితే వీరెవరూ క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదని తెలుస్తోంది. టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రోటోకాల్ విధుల్లో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి నిమగ్నమయ్యారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ కార్తీక మాసం సందర్భంగా శివాలయాల్లో వేడుకల నిర్వహణలో తలమునకలైపోయారు. విచారణ అధికారులు ఎవరి విధుల్లో వారు ఉంటుండగానే కాశీబుగ్గ పోలీసులు మాత్రం విచారణ మొదలు పెట్టేశారు. ప్రత్యక్ష సాక్షులు, ఆలయ పరిసరాల్లో నివాసముంటున్న వారిని నేరుగా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారు చెప్పిన వివరాలను రికార్డు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ధర్మకర్త హరిముకుంద పండా తనయుడు, కాశీబుగ్గ ప్రముఖ వైద్యులు రాజ్‌కుమార్‌ను ఘటన జరిగిన రోజునే కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు రప్పించి వివరాలు సేకరించారు. అదే రోజు ఆలయ నిర్మాణ పనులు చేసిన కణితి ప్రకాశరావు, పొందర చక్రపాణి అనే ఇద్దరు మేస్త్రీలను విచారణ చేశారు. తర్వాత వారిని విడిచిపెట్టేశారు. వీరితో పాటు కూలీలను సైతం విచారణకు పిలుస్తున్నారు.

గుడి తలుపులు మూసిందెవరు?

సందర్శకుల తాకిడి విపరీతంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా గుడి తలుపులు మూసేయడం వల్లే తొక్కిసలాటకు దారి తీసినట్లు తెలుస్తోంది. అయితే ఆ రోజు గేటు తలుపులు ఎవరు వేశారు?, ఎవరు వేయమని చెప్పారు? ఎందుకు గేటు తలుపులు వేయాల్సి వచ్చిందనే దిశగా విచారణ సాగినట్లు కనిపించడం లేదు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలకు వెంకటేశ్వర స్వామికి భోగం పెడుతుంటారు. శనివారం మాత్రం ఒంటి గంట సమయంలో భోగం పెడుతుంటారని యాత్రికులు చెబుతున్నారు. ఆ రోజు కూడా భోగం కోసం తలుపులు వేశారా?, యాత్రికుల తాకిడిని నిలువరించేందుకు తలుపులు వేశారా? అన్న విషయాలు తెలియాల్సి ఉంది.



అమలాపురంలో ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అత్యాచార నిందితుడిని శిక్షించాలని ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం(అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం బాణాపురంలో పదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. తుని ఘటన మరువక ముందే ఇటువంటి మరో ఘటన జరగడం బాధాకరమన్నారు. నిందితుడు రాయపురెడ్డి సత్యవెంకటకృష్ణను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ ధర్నాలో సిఐటియు, ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా, యుటిఎఫ్, కెవిపిఎస్, పిడిఎస్‌యు, బిఎస్‌పి, సిపిఐ, వ్యవసాయ, కౌలు రైతుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారు

- ఎస్ఐఆర్ రెండో దశపై సుప్రీంను ఆశ్రయించిన డిఎంకె

చెన్నై : దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రెండోదశను వ్యతిరేకిస్తూ డిఎంకె సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ ప్రక్రియ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందని పేర్కొంది. ఎస్ఐఆర్ పేరుతో జాతీయ పౌరపట్టిక (ఎన్ఆర్సి)ని రూపొందిస్తున్నారని విమర్శించింది. ఈ మేరకు డిఎంకె తమిళనాడు నిర్వాహక కార్యదరిశ ఆర్.ఎస్.భారతి సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఓటర్లు తమను తాము పౌరులుగా నిరూపించుకునే భారం మోపడం ద్వారా ఎస్ఐఆర్ తన చట్ట పరిధి దాటి వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని ఆ పిటిషన్ పేర్కొంది. వాస్తవంలో దీన్ని చూస్తుంటే కచ్చితంగా ఎన్ఆర్సిని అమలు చేసేదిగా వుందని పేర్కొంది. అక్టోబరు 27న జారీచేసిన ఈ ఉత్తర్వులను కొట్టివేయకపోతే, ఈ ప్రక్రియ మొత్తంగా ఏకపక్షమై పోతుందని, తగు పద్ధతి అవలంభించనందున లక్షలాదిమంది ఓటర్లు తమ ప్రతినిధులను ఎన్నుకునే హక్కుకు దూరమవుతారని పేర్కొంది. తద్వారా దేశంలో స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు జరిగేందుకు అంతరాయం కలుగుతుందని ఆ పిటిషన్‌లో భారతి పేర్కొన్నారు. అక్టోబరు 28నుండి ప్రారంభమైన ఎస్ఐఆర్ రెండోదశను సవాలు చేస్తూ దాఖలైన మొదటి పిటిషన్ ఇది. తగు ప్రక్రియను అవలంబించకపోవడమే కాకుండా, ఇంత తక్కువ కాల వ్యవధిలోనే అమలుకు నిర్ణయించడం సహేతుకంగా లేదని అన్నారు.

కొత్త డిమాండ్ల డ్రాఫ్ట్‌ను సమర్పించండి

- లడఖ్ నేతలతో చర్చలకు ముందు
- కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ ఆదేశాలు

న్యూఢిల్లీ : లడఖ్ నాయకులతో చర్చలు జరగబోతున్న నేపథ్యంలో కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) కీలక ఆదేశాలు జారీ చేసింది. డిమాండ్లపై కొత్త, వివరణాత్మక డ్రాఫ్ట్‌ను సమర్పించాలని లేహ్ ఎపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రాటిక్ అలయన్స్ (కేడీఏ) లను కోరింది. తమ డిమాండ్ల జాబితాతో కూడిన ఒక వివరణాత్మక డ్రాఫ్ట్‌ను సిద్ధం చేస్తామని కేడీఏ సీనియర్ నాయకుడు సజ్జాద్ కార్గిలీ ఓ వార్త సంస్థతో మాట్లాడుతూ చెప్పారు. డ్రాఫ్ట్ సిద్ధం చేయడానికి ముందు అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకుంటామని తెలిపారు. లడఖ్‌కు రాష్ట్ర హెూదా(సభతో కూడిన రాష్ట్రం) ఇవ్వడం, స్థానికుల భూ, ఉద్యోగ హక్కులను రక్షించడానికి ఆరో షెడ్యూల్ అమలు వంటివి తమ ప్రధాన డిమాండ్లుగా ఆయన చెప్పారు. తాము రూపొందించే డ్రాఫ్ట్‌లో తమ ప్రధాన డిమాండ్ల గురించి సమగ్రంగా ఉంటాయన్నారు. " మాకు ఎలాంటి అసెంబ్లీ చట్టసభ కావాలి, అసెంబ్లీ పాత్ర ఏమిటి, గవర్నర్ అధికారాలు ఎంత వరకు ఉండాలి వంటివి ఆ డ్రాఫ్ట్‌లో చర్చిస్తాం" అని సజ్జాద్ వివరించారు. లేహ్ ఎపెక్స్ బాడీ నాయకులు కూడా వారి వివరణాత్మక డ్రాఫ్ట్ కాపీ సిద్ధం చేస్తారని ఆయన చెప్పారు. "మేము మా డ్రాఫ్ట్‌లను ఖరారు చేసిన తర్వాత, వాటిని పరస్పరం మార్చుకుంటాం. ఆ తర్వాత ఒక సమిష్టి సమగ్రమైన కాపీని రూపొందిస్తాం" అని ఆయన వివరించారు. కాగా కొత్త డ్రాఫ్ట్ సమర్పణకు ఎంహెచ్ఏ ఏదైనా కాలపరిమితి ఇచ్చిందా అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. 'లేదు' అని సమాధానం ఇచ్చారు. తాము ఈ వారంలోనే సమిష్టి డ్రాఫ్ట్‌ను సమర్పించాలని భావిస్తున్నామనీ, డ్రాఫ్ట్ అందుకున్న కొన్ని రోజుల్లోనే ఎంహెచ్ఏ తమను హై పవర్డ్ కమిటీ(హెచ్‌పీసీ) సమావేశానికి ఆహ్వానించవచ్చని ఆయన తెలిపారు.

సెప్టెంబర్ 24న లేహ్‌లో జరిగిన ఆందోళనలో హింస చెలరేగిన తర్వాత కేంద్రం, లడఖ్ నాయకుల మధ్య చర్చలు నిలిచిపోయిన విషయం విదితమే. ఆ ఘటనలో నలుగురు మరణించగా.. 80 మంది గాయపడ్డారు. అయితే ఎంహెచ్ఏ న్యాయ విచారణ ప్రకటించిన తర్వాత.. ఉపసంఘ స్థాయి చర్చలు తిరిగి ప్రారంభమయ్యాయి.

కల్తీ మద్యం సూత్రదారులందరినీ బయటకు లాగుతాం

- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొలకలచెరువు కల్తీ మద్యం సూత్రదారులందరినీ బయటకు లాగుతామని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్తీ మద్యం పాత్రదారులతో జోగి రమేష్ బంధాలపై పక్కా ఆధారాలు ఉండడంతోనే సిట్ అరెస్టు చేసిందని చెప్పారు. నకిలీ మద్యం తయారీకి రమేష్ ఏ విధంగా కుట్ర చేశారో జనార్ధనరావు స్టేట్‌మెంట్ బయటపడిందన్నారు. గత ప్రభుత్వంలో నకిలీ మద్యం వల్ల 30 వేల మంది చనిపోయారని, వేలాది మంది ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు తీసి, ఆస్తుల్ని కొల్లగొట్టిన వైసిపి నేతలు తమ బండారం బయటపడి ఆధారాలతో అరెస్టు చేస్తే కులం పేరు వాడుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.

నల్లపురెడ్డి బుద్ధి మార్చుకోవాలి : గ్రీష్మ

నారా భువనేశ్వరిపై వైసిపి నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, బుద్ధి మార్చుకోవాలని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ హెచ్చరించారు. ఎన్‌టిఆర్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ప్రసన్నకుమారెడ్డి నీచ వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రజలు అతనని అసహ్యించుకునే స్థాయికి ఎదిగారని అన్నారు. భువనేశ్వరికి అతను బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నారా భువనేశ్వరికి లండన్‌లో సత్కారం జరగడం తమకు గర్వకారణమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తెలిపారు.

మంజీ మళ్లీ సత్యేంద్ర భయ్యాదే..

- సిపిఎం అభ్యర్థికి ప్రజల మద్దతు
- ప్రశ్నలతో వినూత్న ప్రచారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్ ఎన్నికల్లో ఈసారి కూడా మంజీ అసెంబ్లీ స్థానాన్ని సిపిఎం అభ్యర్థి సత్యేంద్ర భయ్యాదేనని అక్కడి ప్రజలు అంటున్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వెంటనే అక్కడికి చేరుకునే వ్యక్తి ఎమ్మెల్యే సత్యేంద్ర యాదవ్ అని స్థానికులు చెబుతున్నారు. బీహార్ రాష్ట్రంలోని సరణ్ జిల్లాలో మంజీ స్థానానికి పోటీ చేస్తున్న ఆయన ప్రజలకు ప్రశ్నలు వేస్తూ వినూత్న ప్రచారం చేస్తున్నారు. 'మన దేశానికి రావాల్సిన ఫ్యాక్టరీలను గుజరాత్‌కు తీసుకెళ్లిన వారు మీ స్నేహితులా లేక శత్రువులా?' అని లెజువారా గ్రామంలో జరిగిన ప్రజా సభలో డాక్టర్ సత్యేంద్ర యాదవ్ అక్కడికి వచ్చిన జనసమూహాన్ని అడిగారు. 'వారు మా శత్రువులు!...' అని వెంటనే సమాధానం ఏకగ్రీవంగా ఉంది. 'రాజ్యాంగాన్ని నాశనం చేసేవారు.. అంబేద్కర్ విగ్రహాలను ధ్వంసం చేసేవారు.. మీ స్నేహితులా? అని అభ్యర్థి తదుపరి ప్రశ్న. 'లేదు... వారు.. ప్రజలకు శత్రువులు' అని స్థానికులు స్పందించారు. మంజీలో సిపిఎం సిట్టింగ్ ఎమ్మెల్యే సత్యేంద్ర యాదవ్ స్థానికులను ఓట్ల కోసం విజ్ఞప్తి చేస్తున్న తీరు ఇది. ప్రశ్నోత్తరాల శైలిలో వారి శత్రువులు ఎవరో చెప్పాలని ఓటర్లను అడిగిన తరువాత, ఆయన మరో విషయం గురించి విచారిస్తారు. 'మీరు మీ శత్రువులకు ఓటు వేస్తారా?' అని అడిగిన వెంటనే 'లేదు.. వారికి మా ఓట్లు లేవు' అని ప్రజల నుంచి దృఢమైన సమాధానం వెంటనే వచ్చింది. కుల ఆధారిత హత్యలు, దారుణాలకు పేరుగాంచిన ఈ ప్రాంతంలో గత ఐదేళ్లలో అలాంటి సంఘటన జరగకపోవడం ఎమ్మెల్యేగా సత్యేంద్ర యాదవ్ సాధించిన అతిపెద్ద విజయం.



రాజ్‌పుట్‌కు చెందిన రణధీర్ సింగ్‌ను జెడియు తన అభ్యర్థిగా రంగంలోకి దింపింది. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు ఎంపిగా ఎన్నికైన ప్రభునాథ్‌సింగ్ కుమారుడు రణధీర్. 1995లో తనను ఓడించిన ఎమ్మెల్యే అశోక్‌సింగ్‌పై బాంబు విసిరి హత్య చేసినందుకు ప్రభునాథ్ జీవిత ఖైదులో ఉన్నాడు. దళితులు, వెనుకబడిన వర్గాలపై జరిగిన దారుణాలతో సహా 200కి పైగా క్రిమినల్ కేసుల్లో ఆయన నిందితుడు. సత్యేంద్ర యాదవ్‌కు పార్టీ, ప్రజల పూర్తి మద్దతు లభించింది. 'సత్యేంద్ర భయ్యా' ఎమ్మెల్యే అయిన తరువాత, దళితులు, వెనుకబడిన తరగతులకు అడగడానికి, చెప్పడానికి ఒకరు ఉన్నారనేది స్పష్టమైంది. అగ్ర కులాలు కాలనీల్లోకి ప్రవేశించడం, దౌర్జన్యాలు చేయడం మానేశారు. కాలనీలు, పాఠశాలల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పించబడ్డాయి. సత్యేంద్ర యాదవ్‌కు పార్టీతో సంబంధం లేకుండా యువత నుండి చాలా మద్దతు లభిస్తుంది. 'మొత్తం యువత ఆయనతో ఉన్నారు' అని ప్రచారంలో ఉన్న యువకుడు పియూష్ అన్నారు. సత్యేంద్ర యాదవ్ మళ్లీ గెలిస్తే, రాజ్‌పుత్ సమాజం ఆధిపత్యం చెలాయించదని రణధీర్‌సింగ్ మద్దతుదారులు ప్రచారం చేస్తున్నారు. రాజ్‌పుత్ వర్గానికి చెందిన స్వతంత్ర అభ్యర్థి రాణా ప్రతాప్‌సింగ్‌ను పోటీ నుండి తప్పించడానికి బిజెపి ప్రయత్నిస్తోంది.



ఆ ఆడియో టేపులను సవరించారు!

- మణిపూర్ అల్లర్లపై ఫోరెన్సిక్ నివేదికను వెల్లడించిన సుప్రీం



న్యూఢిల్లీ : జాతుల ఘర్షణలను రెచ్చగొట్టేలా మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ టెలిఫోన్‌లో జరిపిన సంభాషణలు వున్నాయని, వేగు నుండి సేకరించిన ఆడియో టేపులు సవరించి, మార్పులు, చేర్పులు చేశారని, మొత్తంగా తారుమారు చేశారని ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడైందని గాంధీనగర్‌లోని జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్శిటీ అందజేసిన నివేదిక గురించి కుకీ హక్కుల సంస్థకు సోమవారం సుప్రీంకోర్టు తెలియచేసింది. ఈ నివేదికను జస్టిస్ సంజయ్ కుమార్ నేతృత్వంలోని బెంచ్ కోర్టు రూమ్‌లో చదివి వినిపించింది. ఆ ఆడియో టేపుల గొంతును పోల్చడానికి శాస్త్రీయంగా సరైనవి కావని, ఆడియో టేపులను మార్చివేశారని నివేదికలో ఉందని కుకీ సంస్థ తరపు న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, చెరియల్ డిసౌజాలకు జస్టిస్ కుమార్ తెలియజేశారు. ట్రూత్ ల్యాబ్స్ నిర్వహించిన పరీక్షా ఫలితాలను ప్రస్తావిస్తూ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ఆ ఆడియో టేపుల్లో ఎలాంటి బ్రేక్స్ లేవని తేలిందన్నారు. అంటే అది ఎలాంటి మార్పులకు లోనవలేదని తెలుస్తోందన్నారు. ఆ రికార్డింగ్‌లో 93శాతం వరకు వాయిస్ కలుస్తోందంటూ అది నిజమైనదేనని అర్థమవుతోందని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ కుమార్ స్పందిస్తూ, గాంధీనగర్ వర్శిటీ అత్యుత్తమమైనదిగా పరిగణిస్తారని, దాని నిర్ధారణలను అనుమానించాల్సిన అవసరం లేదని అన్నారు. ఆ నివేదికను పిటిషనర్‌కు, మణిపూర్ ప్రభుత్వానికి అందజేయాల్సిందిగా బెంచ్ ఆదేశించింది. ఈ నివేదికపై రెండు వారాల్లోగా స్పందించాల్సిందిగా పిటిషనర్‌కు కోర్టు అనుమతినిచ్చింది. ఏడాది క్రితమే ఈ ఆడియో టేపులను ప్రభుత్వానికి పంపినా ఇప్పటివరకు దానిపై దర్యాప్తు జరగలేదని ప్రశాంత్ భూషణ్ అన్నారు. ఆ ఆడియో టేపులను పరిశీలిస్తే స్వయంగా అప్పటి ముఖ్యమంత్రే అల్లర్లను రెచ్చగొట్టారని కుకీ సంస్థ ఆరోపిస్తోంది.

బీహార్ పునర్నిర్మాణం అవసరం : కాంగ్రెస్ నేత జైరాం రమేష్

బీహార్‌లోని బిజెపి – జెడియు ప్రభుత్వం 20 ఏళ్ల పాలనలో 'వలస పరిశ్రమ'ను మాత్రమే స్థాపించిందని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ విమర్శించారు. బీహార్ పునర్నిర్మాణం అవసరమని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో సోమవారం ఒక పోస్టు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, అవిభక్త బీహార్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అనేక పారిశ్రామిక యూనిట్లను స్థాపించాయని గుర్తుచేశారు. జెడి(యు)– బిజెపి ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో మూడు కోట్లకు పైగా బీహార్ ప్రజలు ఉపాధి కోసం రాష్ట్రాన్ని విడిచిపెట్టారని తెలిపారు. 'రెండు దశాబ్దాలుగా బిజెపి – జెడియు ప్రభుత్వం క్రమపద్ధతిలో, ఉద్దేశపూర్వకంగా బలహీనపరిచిన బీహార్ పరిశ్రమ, ఉపాధి, స్వావలంబనను పునరుద్ధరించడం, బలోపేతం చేయడమే కాంగ్రెస్ సంకల్పం. బీహార్‌కు వలసలు కాదు, పునర్నిర్మాణం అవసరం' జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

అణుపరీక్షలు చేస్తాం

- ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేయగలం
- రష్యా, చైనాల వద్ద చాలా ఉన్నాయి
- మమ్దాని సోషలిస్టు కాదు కమ్యూనిస్టు
- ట్రంప్ వ్యాఖ్యలు...



వాషింగ్టన్ : ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేసే అణ్వాయుధాలు అమెరికా వద్ద ఉన్నాయని స్వయంగా ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆదివారం నాడు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక నుండి అమెరికా అణ్వాయుధాలను పరీక్షిస్తుందని, చాలా దేశాలు అణు పరీక్షలు చేస్తున్నాయని అన్నారు. తమ వద్ద అత్యుత్తమమైన అణ్వాయుధాలున్నాయని,

అయినా పెంచుకోవల్సిన అవసరం ఉందని అన్నారు. అవి ఎలా పని చేస్తున్నాయో పరీక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చైనా, రష్యా, ఉత్తర కొరియా దేశాల వద్ద కూడా అణ్వాయుధాలున్నాయని, కాని వారు బయటకు చెప్పరని అన్నారు.

గత 30 సంవత్సరాల నుండి ఎటువంటి పరీక్షలు అమెరికా చేయలేదన్నారు. వారు అణు పరీక్షలు చేస్తున్నప్పుడు అమెరికా ఎందుకు చేయని దేశంగా ఉండాలని అన్నారు. ఆ దేశాలు రహస్యంగా భూగర్భంలో పరీక్షిస్తారు వాటి గురించి ప్రపంచానికి తెలియదని చెప్పుకొచ్చారు.

పుతిన్, జిన్‌పింగ్ కఠినాత్ములు, బలమైన నేతలు

పుతిన్, జిన్‌పింగ్ చాలా కఠినాత్ములు, బలమైన నాయకులు, తీవ్రంగా పరిగణించాల్సిన వ్యక్తులు అని వ్యాఖ్యానించారు. చైనాతో వాణిజ్య ఒప్పందం కుదిరింది కదా అని ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్టు ప్రశ్నించగా ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. 'మేము చైనాని ఓ కంట కనిపెడతాం. వారు అమెరికాను ఎల్లప్పుడూ కనిపెడ్తూ ఉంటారని అన్నారు. గత 8 నెలల కాలంలో 8 యుద్ధాలను ఆపానని, భారత్, పాక్‌ల మధ్య అణుయుద్ధాన్ని నివారించానని మరోసారి వ్యాఖ్యానించారు.

మమ్దానిపై విమర్శలు..

న్యూయార్క్ మేయర్ ఎన్నికల ఫలితాలు కొద్ది గంటల్లో వెలువడనున్న నేపథ్యంలో ట్రంప్ డెమొక్రాట్స్ సోషలిస్టు అభ్యర్థి జోహ్రాన్ మమ్దానిపై విమర్శలు చేశారు. అతను సోషలిస్టు కాదు, కమ్యూనిస్టు అని అన్నారు. 'మమ్దాని గెలిస్తే అధ్యక్షుడిగా నేనే నిధులు కేటాయించను. ఎందుకంటే న్యూయార్క్‌ను నడిపించేది కమ్యూనిస్టు అయినప్పుడు పంపించడం వృథా' అని అక్కసు వెళ్లగక్కారు. డెమొక్రాట్స్‌లో చెడ్డవారు, కమ్యూనిస్టులు ఉంటే నేను చెడ్డవారి పక్కనే నిలబడతానని మరో మేయర్ అభ్యర్థి క్యూమోను ఉద్దేశించి ట్రంప్ పేర్కొన్నారు.



ఆఫ్ఘనిస్తాన్‌లో భూకంపం

- 20మందికి పైగా మృతి
- 300మందికి పైగా గాయాలు

కాబూల్ : ఉత్తర ఆఫ్ఘనిస్తాన్‌లో సోమవారం తెల్లవారు జామున శక్తివంతమైన భూకంపం సంభవించింది. ఈ విషాద ఘటనలో 20మందికి పైగా మరణించారు. 300మందికి పైగా గాయపడ్డారని హెూం శాఖ వర్గాలు తెలిపాయి. మజర్ షరీఫ్ నగరానికి సమీపంలో భూమిలో 28కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం నమోదైందని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఇళ్లు కూలిపోతాయన్న భయంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ఇళ్ళ బయటకు వచ్చి వీధుల్లో గుంపులు గుంపులుగా నిలుచున్నారు. ఈ నగరంలో ప్రఖ్యాతి గాంచిన, 15వ శతాబ్దికి చెందిన బ్లూ మసీదు కూడా దెబ్బతిందని మీడియా వార్తలు తెలిపాయి. బాల్క్, సమంగన్ ప్రావిన్స్‌ల్లో ఎక్కువగా మరణాలు నమోదయ్యాయని ఆరోగ్య శాఖ ప్రతినిధి తెలిపారు. దక్షిణంగా 420 కిలోమీటర్ల దూరంలో వున్న కాబూల్‌లో కూడా ఈ ప్రకంపనల ప్రభావం కనిపించింది. పర్వత ప్రాంతాలు ఎక్కువగా వుండే ఆఫ్ఘనిస్తాన్‌లో కమ్యూనికేషన్ సదుపాయాలు అంతంత మాత్రంగా వుండడంతో జరిగిన నష్టం అంచనాకు కూడా చాలా రోజులు పడుతుంది. బాధిత ప్రాంతాలకు అధికారులు వెంటనే వెళ్ళలేరు కూడా. గత ఆగస్టులో వచ్చిన భూకంపంలో 2200మంది మరణించారు. గ్రామాలకు గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి.

ఆ గ్రామాలను బుగ్గి చేస్తారా?

(మొదటిపేజి తరువాయి)

నాయకులు మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలోని 37 కుటుంబాలు ఖాళీ చేయాల్సి ఉంటుందని గ్రామస్తులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. పామాయిల్, వేరుశనగ, పొగాకు పంటలు పండే పచ్చని పొలాల్లో డిపో ఏర్పాటు చేయాలని చూస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దాట్లవారిగూడెంలోని పామాయిల్ తోటలో జరిగిన బహిరంగ సభకు గిరిజనులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సభకు తెల్లం రామకృష్ణ, కారం దారయ్య, భూషణం, దుర్గారావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. గ్రామ పీసా కమిటీ సభ్యులు నారం మల్లేశ్వరరావు, పీసా కమిటీ కార్యదర్శి నారం రవి, బాధిత గ్రామాల ప్రజలు తెల్లం శంకురుడు, కారం నాగదుర్గ, మడకం శేషగిరిరావు మాట్లాడుతూ నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు తమపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లోకి పోలీసులను దింపి అలజడి సృష్టిస్తున్నారని, ప్రలోభాలకు గురిచేసి ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ఆయుధ డిపో నిర్మించాలని చూస్తున్నారన్నారు.

భూములు లాక్కుంటే ఆత్మ గౌరవంపై దెబ్బకొట్టినట్లే : వి శ్రీనివాసరావు

ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయుధ డిపో ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని ప్రజలు చెబుతూ ఏకవాక్య తీర్మానం చేశారని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించాల్సి ఉందని తెలిపారు. మూడు పంటలు పండే భూములను లాక్కుంటే రైతుల ఆత్మ గౌరవంపై దెబ్బ కొట్టినట్లేనన్నారు. ఎంఎల్ఏ చిర్రి బాలరాజు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయుధ డిపో వద్దన్నారని, అధికారంలోకి వచ్చాక ఇందుకు భిన్నం వ్యవహరిస్తున్నారని వివరించారు. ఉద్యోగాలు వస్తాయని, పరిహారం ఇస్తామని వట్టిమాటలు చెబుతున్నారని, పోలవరం నిర్వాసితులకు ఇప్పటికీ అతీగతీ లేదని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల్లో ఎనిమిది వేల మందికి ఇప్పటికీ ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. గంగవరం పోర్టులో కొద్దిమందికి ఉద్యోగాలిచ్చి మమ అనిపించారని తెలిపారు. ఏజెన్సీలోని 1/70, పీసా చట్టాలను, రాజ్యాంగాన్ని గౌరవించాలన్నారు. జిల్లా కలెక్టర్, అధికారులు తప్పుడు సమాచారం ఇవ్వొద్దని హితవు పలికారు. ఎంఎల్ఏ ఇంటికి మూడు కిలోమీటర్ల దూరంలో మూడు వేల ఎకరాల అటవీ భూములు ఉన్నాయని, అక్కడ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని అన్నారు. ఎంపి, ఎంఎల్ఎలకు స్వప్రయోజనాలు తప్ప, ప్రజల ప్రయోజనాలు పట్టడంలేదని వివరించారు.

ఆదివాసీలపై పడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు : అక్కినేని వనజ

సిపిఐ కేంద్ర కమిటీ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై పడ్డాయని విమర్శించారు. జమ్మూకాశ్మీర్ నుంచి ఏలూరు జిల్లా వరకూ అన్నిచోట్లా రకరకాల ప్రాజెక్టుల పేరుతో ఆదివాసీల భూములను లాక్కుంటున్నాయని వివరించారు. ఐదు గ్రామాల ప్రజలు ఐక్యతతో ఉంటే విజయం మనదేనన్నారు. సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు ఎంఎస్.నాగరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు హరినాథ్, ఎస్‌యుసిఐ రాష్ట్ర నాయకులు సుధీర్, ఆదివాసీ సేన రాష్ట్ర నాయకులు మడకం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో ప్రజలు వ్యతిరేకిస్తున్నా నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయడం తగదన్నారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు ఎ.రవి, మన్నవ కృష్ణ చైతన్య, నాయకులు మొడియం నాగమణి, తెల్లం దుర్గారావు, తగరం బాబూరావు, వెంకటేశ్వరరావు, గిరిజన నాయకులు అశోక్, ఇతర వామపక్ష, గిరిజన నాయకులు పాల్గొన్నారు. వామపక్షాల పర్యటనను అడ్డుకునేందుకు పోలీసులు తొలుత ప్రయత్నించి, ఆ తర్వాత వెనక్కి తగ్గారు.

ఏ ప్రధానీ ఇలా మాట్లాడలేదు

- మోడీపై తేజస్వియాదవ్ విమర్శలు

పాట్నా : ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉపయోగిస్తున్న అభ్యంతరకర పదాలు, భాషను గతంలో ఏ ప్రధానీ ఉపయోగించలేదని ఆర్‌జెడి నాయకులు తేజస్వి యాదవ్ విమర్శించారు. ఇటీవల బీహార్ ప్రచారంలో ప్రధానమంత్రి మోడీ 'కట్టా' (అనుమతిలేని తుపాకీ) అనే పదాన్ని ఉపయోగించడంపై ఆయన స్పందించారు. పాట్నాలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ప్రధాని ఆరోపణలపై నేను ఏమీ మాట్లాడలేను. ఇప్పటివరకూ దేశంలో ఏ ప్రధానమంత్రి ఇలాంటి పదాలు వాడటం నేను ఎప్పుడూ వినలేదు. ఇలాంటి మాటలు మోడీ ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయి' అని తెలిపారు. 'గుజరాత్‌కు ప్రధాని వెళ్లినప్పుడల్లా అక్కడ ఐటి ఫ్యాక్టరీలు, సెమీకండక్టర్ యూనిట్లు, డేటా సెంటర్ల గురించి మాట్లాడతారు. బీహార్‌కు వచ్చినప్పుడు 'కట్టా' గురించి మాట్లాడతారు' అని విమర్శించారు. ఆదివారం జరిగిన ప్రచారంలో మోడీ మాట్లాడుతూ ఇండియా బ్లాక్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వియాదవ్‌ను అంగీకరించడానికి కాంగ్రెస్ ఇష్టపడలేదని, అప్పుడు ఆర్‌జెడి కాంగ్రెస్ గన్‌పాయింట్‌పై 'కట్టా' పెట్టి ఒప్పించిందని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆదివారం భోజ్‌పూర్, నవాడ జిల్లాల్లో వరుస ర్యాలీల్లో మోడీ ప్రసంగించారు.

కాంగ్రెస్-ఆర్‌జెడిపై మోడీ విమర్శలు

సీమాంచల్ ప్రాంతంలో చొరబాట్లను కాంగ్రెస్–ఆర్‌జెడి ప్రోత్సహిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆరోపించారు. ఆ ప్రాంతంలో జనాభా సమతుల్యతను దెబ్బతీయడానికి 'ప్రమాదకరమైన కుట్ర' పన్నుతున్నాయని అన్నారు. సోమవారం కతిహార్‌లో జరిగిన ప్రచారంలో మోడీ పాల్గొన్నారు. దాదాపు 30 నిమిషాలపాటు ప్రసంగించిన మోడీ ఉగ్రవాదులకు ఇండియా బ్లాక్ పార్టీలు లొంగిపోయాయని అన్నారు. సీమాంచల్ ప్రాంతం బీహార్ సంస్కృతి, నాగరికతకు ప్రహరి వంటిదని, ఇక్కడ కొన్నేళ్లుగా చొరబాట్లను ప్రతిపక్ష పార్టీలు ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలు బీహార్ భవిష్యత్‌ను ప్రమాదంలో పడేస్తున్నాయని ఆరోపించారు. పార్లమెంట్‌లో ట్రిపుల్ తలాక్ బిల్లును అడ్డుకోవడానికి ప్రయత్నించిన ప్రతిపక్ష పార్టీలు ఇప్పుడు పార్లమెంట్ ఆమోదించిన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేస్తామని చెబుతున్నాయని అన్నారు.

వీధి కుక్కల కేసులో 7న సుప్రీం తీర్పు

- కోర్టు ఎదుట హాజరైన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సిఎస్‌లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వీధి కుక్కల కేసులో ఈ నెల 7న సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేయనుంది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్‌తో కూడిన ధర్మాసనం వెల్లడించింది. మీడియాలో వచ్చిన కథనం ఆధారంగా జులై 28న సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు.. వీధి కుక్కల అంశంపై విచారిస్తోంది. సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, సందీప్ మెహతా, ఎన్‌వి అంజరియాలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయనంద్‌తోపాటు చాలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల అమలుపై చాలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అఫిడవిట్లు దాఖలు చేశాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ఈ నెల 7న ఆదేశాలు జారీ చేస్తామని, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు (తెలంగాణ, పశ్చిమ బెంగాల్ మినహా) వ్యక్తిగత హాజరు ఇకపై అవసరం లేదని పేర్కొంది. కోర్టు జారీ చేసిన ఆదేశాలను పాటించడంలో ఏదైనా వైఫల్యం జరిగితే, అప్పుడు కోర్టు ముందు హాజరు అవ్వాల్సి వస్తుందని స్పష్టం చేసింది. ఆగస్టు 22న కోర్టు ఆదేశించినప్పటికీ సమ్మతి అఫిడవిట్లు ఎందుకు దాఖలు చేయలేదో వివరించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులను నవంబరు 3న కోర్టుకు వచ్చి, ధర్మాసనం ముందు హాజరుకావాలని అక్టోబరు 27న సుప్రీంకోర్టు ఆదేశించింది.

చట్టం అన్యాయంగా వుంటే శాంతియుతంగా ఉల్లంఘించొచ్చు

- ఢిల్లీ అల్లర్ల కేసులో సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : ఈశాన్య ఢిల్లీలో 2020లో జరిగిన అల్లర్ల కేసులోని నిందితులు ఉమర్ ఖలీద్, గుల్ఫిషా ఫాతిమా, షార్జిల్ ఇమామ్ ప్రభృతుల బెయిల్ పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. తన క్లయింట్ షిఫా ఉర్ రెహమాన్‌ను యుఎపిఎ కింద ఎలాంటి నేరం చేయకపోయినా నిందితుడిగా చేర్చారని ఆయన తరపు వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ పేర్కొన్నారు. అన్యాయమైన చట్టమేదైనా వుంటే దాన్ని శాంతియుతంగా ఉల్లంఘించేందుకు మనకు నైతికంగా హక్కు వుందని గాంధీ సిద్ధాంతం చెబుతోందని అన్నారు. తన నిందితుడిని ప్రత్యేకంగా ఎంపికచేసి మరీ నిందితుడిగా నమోదు చేశారని అన్నారు. యుఎపిఎ కింద అతనిపై ఏదీ నిర్ధారణ కాలేదని చెప్పారు. సహ నిందితులు ఇద్దరికి ఇప్పటికే బెయిల్ మంజూరు చేసిన ఆ ప్రాతిపదికనే తన క్లయింట్‌కు కూడా మంజూరు చేయాలని తాను కోరుతున్నానని ఖుర్షీద్ వాదించారు. దీనిపై తదుపరి విచారణను 6వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. అంతకుముందు సోమవారం విచారణ ప్రారంభమైన వెంటనే ఉమర్ ఖలీద్ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ, ఢిల్లీ అల్లర్లకు సంబంధించి 116 కేసులను విచారిస్తే, అందులో 97మంది నిర్దోషులుగా తేలిందన్నారు. దాదాపు 17కేసుల్లో సాక్ష్యాధారాలు తారుమారయ్యాయని కోర్టు గుర్తించిందన్నారు. దానికి ఖలీద్‌కు సంబంధమేంటని బెంచ్ ప్రశ్నించగా, ఖలీద్‌కు సంబంధం లేదని, కేవలం రికార్డయిన వాస్తవాలు చెబుతున్నానని సిబల్ చెప్పారు. వారి గురించి కన్నీళ్లు కారుస్తున్నారా అని జస్టిస్ కుమార్ ప్రశ్నించగా, దర్యాప్తు జరిగినతీరు, నాణ్యతను ఎత్తిచూపుతున్నానని తెలిపారు.

'ఓటుకు నోటు' వ్యవహారంపై.. జనవరి రెండో వారంలో సమగ్ర విచారణ

- సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఓటుకు నోటు' వ్యవహారంలో వచ్చే ఏడాది జనవరి రెండో వారంలో సమగ్ర విచారణ చేపడతామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల నియామావళి కింద విచారణ చేపట్టాలని కోరుతూ 2021 జులై 22న రేవంత్ రెడ్డి.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ 2021 ఏప్రిల్ 13న సండ్ర వెంకట వీరయ్య వేర్వేరుగా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ రెండు పిటిషన్లపై సోమవారం జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రేవంత్ రెడ్డి తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు.

నైజీరియాలో అమెరికా దాడులు?

- ఖనిజ నిక్షేపాలపై కన్ను
- సైన్యం జోక్యం చేసుకుంటుందన్న ట్రంప్

వాషింగ్టన్ : నైజీరియాలో దాడులకు అమెరికా సిద్ధపడుతుందా? అక్కడి వనరులపై ట్రంప్ కన్నుపడిందా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా ట్రూత్‌లో "నైజీరియా ప్రభుత్వం క్రైస్తవులను చంపడానికి అనుమతిస్తూనే ఉంది. అక్కడి ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూపులు క్రిస్టియన్లపై దాడులు చేస్తున్నాయి. అమెరికా వెంటనే అన్ని సహాయాలను నిలిపేస్తుంది. ఇప్పుడు అమెరికా సైన్యం ఆ దేశంలోకి వెళ్లి ఇస్లామిక్ ఉగ్రవాదులను పూర్తిగా తుడిచిపెట్టే అవకాశం ఉంది" అని పేర్కొన్నారు. దీంతో నైజీరియా ఉలిక్కిపడింది. ఆఫ్రికా ఖండంలో 230 మిలియన్ల అత్యంత జనాభా కలిగిన దేశం నైజీరియా. ఈ జనాబాలో ముస్లింలు, క్రైస్తువులు దాదాపుగా సమానంగా ఉన్నారు. సాయుధ గ్రూపుల ఘర్షణలో అనేక మంది ముస్లిములు అధిక సంఖ్యలో మృతి చెందారు. బొకోహారం వంటి ఉగ్రవాద ముఠాల వల్ల అన్ని మతాలవారు మరణిస్తున్నారు. క్రైస్తవులే లక్ష్యం అనేదానికి స్పష్టమైన ఆధారాలు లేవు. నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ట్రంప్ వ్యాఖ్యలను తిరస్కరించారు. తమ దేశంపై మత పరంగా అసహనం వ్యక్తం చేయడం సరికాదన్నారు. తమ ప్రభుత్వం నైజీరియన్లకు మతపరమైన స్వేచ్ఛ కోసం, వారి విశ్వాసాలను కాపాడటానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. పౌరులకు భద్రతను ప్రభుత్వం కల్పిస్తుందని, తీవ్రవాద అంతానికి అమెరికాతో సహా అంతర్జాతీయంగా కలిసి పనిచేస్తామని వెల్లడించారు. నైజీరియాలో సామూహికంగా క్రైస్తవులను హత్యలు చేస్తున్నందున మత స్వేచ్ఛను ఉల్లంఘించే దేశంగా గుర్తించాలని అమెరికా సెనేటర్ టెడ్ క్రూజ్ గత వారం కాంగ్రెస్‌లో ప్రకటించిన తరువాత ట్రంప్ ఈ బెదిరింపులకు చేయడం గమనార్హం. ట్రంప్ ఉద్దేశం వేరని, రక్షణ సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహకాల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్, రాగి, లాందనం, నియోడైమియం, ప్రసోడైమియం వంటి కీలక ఖనిజ నిక్షేపాలు నైజీరియాలో ఉన్నాయని వాటి కోసమే ట్రంప్ బెదిరింపులని పలువురు విశ్లేషిస్తున్నారు.



మీకోసం

షవర్‌వాజుల్లోని నీటిలో కొద్దిగా బొగ్గుపొడి కలిపితే పూలు ఎక్కువ సమయం తాజాగా ఉంటాయి.

జీవన సౌరభం

అవకాశాల కోసం ఎదురుచూస్తూ ఉండకూడదు. అవకాశాలను కల్పించుకొని లక్ష్యాన్ని సాధించుకోవాలి.

ఉడుతా ఉడుతా ..!



ఉరుకుల పరుగుల
ఓ ఉడుతా
ఊయల ఊపుత
వచ్చి ఊగమ్మా!

గెంతులు గెంతే
ఓ కోతి
కొబ్బరి కుడకలు ఇస్తా
కొరుక్కు తినవమ్మా!

భౌ భౌ అరుపుల
ఓ బేబీ
నీకు భోజనం పెడతా
భోంచేయమ్మా!

మ్యావ్.. మ్యావ్ మీసాల
ఓ పిల్లి కూన
తియ్యటి పాలు పోస్తా
తాగి పోవమ్మా!

మే.. మే నెలల
ఓ బుజ్జీ మేకా
మా తోటకు పోదాం
చక చక రారా!

కావ్..కావ్ కూతల
ఓ నల్ల కాకీ
కుండడు నీళ్ళస్త
కూచోవమ్మా!

కూ.. కూ పాటల
ఓ కోకిలమ్మా
కొండపల్లి బొమ్మిస్తా
ఆడుకోవమ్మా!

చిట్టి చిట్టి పలుకుల
ఓ చిలకమ్మా
నీకు జాంపండిస్తా
మాటాడమ్మా!

ఆటల పాటల
ఓ నేస్తాలూ
అలుగక నాతో రావాలి
కబుర్ల పండుగ
చేయాలి!

చిలిపి చేష్టల
ఓ చిన్నారి
చీకు చింతలూ
వదలాలి
చిందులు వేస్తూ
నవ్వాలి!

- డా.కటుకోర్ళ్వుల రమేష్,
99490 83327.

తూనీగ

తూనీగ తూనీగ తుంటరి తూనీగా
తుల తూగుతావు ఆనందంగా
ఆకాశంలో ఎగురుచుండగా
అందంగా సీతాకోక చిలుక చందంగా!



నీ సుతారాల పట్టు రెక్కలు
సృష్టించేను సుతిమెత్తని రాగాలు
ఒడుపుగా పట్టుకుందామంటే
ఒయ్యారాలు పోతావు!

నీ వెనుకే పరుగులు
పెడుతుంటే
కాళ్ళకెన్నో గుచ్చుకున్నాయి ముళ్ళు
నీ కాళ్ళతో గులక రాళ్ళు ఎత్తుతుంటే
బాధలన్నీ మరిచి పోయేను మా కాళ్ళు!

గుంపులు గుంపులుగా
రివ్ రివ్వున నువు సందడి చేస్తే
మేఘాలే వేంచేస్తాయి వేగిరంగా
చల్లని వర్ష జల్లులే కురిపించగా!

నువ్వు గాలిలో ఎగురుతుంటే
హెలికాప్టర్‌నే తలపిస్తావు
ఆయా రుతువులలో అరుదెంచి
పిల్లలందరినీ అలరిస్తావు!

- పట్లోళ్ళ బక్కారెడ్డి,
97053 15250.

నేను గీసిన బొమ్మ





జె.జ్యోసీ,
6వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్ గౌరవరం,
జగ్గయ్యపేట,
ఎన్‌టిఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

శభాష్ ... శ్రీ చరణి!

'హే చిన్న.. రా చిన్న..' అంటూ సాగే తెలుగు సినిమా పాట గుర్తుంది కదా! అందులో ఒక చోట 'దిమ్మ తిరిగి పొద్దే దెబ్బ కొట్టానంటే గనక..' అన్న లిరిక్స్ వస్తాయి. అచ్చం అలాగే 'మన చిన్న..' అదేనండీ రాయలసీమ ముద్దుబిడ్డ నల్లపురెడ్డి శ్రీచరణి 'ప్రపంచ వన్డే క్రికెట్‌కప్' ఫైనల్ మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రతిభతో రాణించింది. ఇది ఆమెకి తొలి ప్రపంచ కప్. కానీ ఎంతో అనుభవమున్న క్రీడాకారిణిగా ప్రత్యర్థుల పరుగులకి కళ్లెం వేసింది. క్రికెట్ బరిలో అడుగుపెట్టే తను ఎప్పుడూ ఒత్తిడితో ఆడుతున్నట్లు అనిపించదు. మాట్లాడుతున్నప్పుడు చాలా సాధారణంగా కనిపించే ఈ అమ్మాయి, బౌలింగ్ చేసేటప్పుడు మాత్రం సీనియర్ ఆటగాళ్లతో పోటీపడి మరీ ఆడుతుంది. ఈ ప్రతిభే ఇప్పుడు తనని కప్ గెలిచిన సంబరాల్లో భాగం చేసింది. 20 ఏళ్ల నిరీక్షణ తరువాత భారత మహిళా క్రికెట్ జట్టుకి ఇంతటి ఘన విజయం సాకారమైన వేళ మన తెలుగమ్మాయి ఇందులో కీలకభూమిక పోషించడం నిజంగా గర్వకారణం.



శ్రీచరణి సొంతూరు కడప జిల్లా వీరపునాయునిపల్లె మండలం ఎర్రమల్లె గ్రామం. తండ్రి చంద్రశేఖరరెడ్డి కడప థర్మల్ పవర్ ప్రాజెక్టులో చిన్న ఉద్యోగి. అమ్మ రేణుక గృహిణి. ఇద్దరమ్మాయిల్లో శ్రీచరణి రెండో సంతానం. అక్క చరిత అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. చిన్నమ్మాయి అయిన తనను ఇంట్లో అందరూ 'చిన్నా' అని పిలుస్తారని శ్రీచరణి ఒక ఇంటర్వ్యూలో చెప్పింది.


చిన్నప్పటి నుండి ఆటలంటే ఇష్టమైన ఆమె, చదువుతో పాటు ఆటలపై కూడా ప్రత్యేక శ్రద్ధ కనపరిచేది. అదే ఆమెని ఈరోజు ఈ స్థాయిలో నిలబెట్టింది. ఖోఖో, కబడ్డీ, బాడ్మింటన్, క్రికెట్ ఆమెకి ఇష్టమైన ఆటలు. ఖోఖో ఆటలో జాతీయస్థాయి వరకు వెళ్లింది. అథ్లెటిక్స్ ట్రైనింగ్‌కి కూడా ఎంపికైంది. అయితే పదోతరగతిలో ఉన్నప్పుడు తన దృష్టి మొత్తం 'క్రికెట్ ఆటపైనే ఉంచాలనుకున్నట్లు' ఒక సందర్భంలో చెప్పింది. క్రికెట్ తొలినాళ్లలో తనని మామయ్య కిషోర్‌రెడ్డి ఎంతో ప్రోత్సహించారు. ఇప్పటికీ ఆయన సూచనలు పాటిస్తానని ఆమె చెబుతుంది. క్రికెట్‌లోనే తన ప్రతిభ చూపించాలనుకున్న శ్రీచరణి 10వ తరగతి పూర్తవ్వడంతోనే మొదట పొద్దుటూరులో ఆ తరువాత హైదరాబాద్ కూకట్‌పల్లిలో రంజీ మాజీ ఆటగాడు సురేష్ దగ్గర శిక్షణ తీసుకుంది.

గ్రామంలో పేస్ బౌలర్‌గా రాణించిన శ్రీచరణి, సురేష్ దగ్గర ఆఫ్ స్పిన్నర్‌గా కెరియర్ ప్రారంభించింది. ఆ సమయంలోనే అండర్-19 ఆటలకి ఎంపికైంది. అయితే 2019లో వరల్డ్ కప్ కోసం నిర్వహించిన హైలెవెల్ శిక్షణా శిబిరానికి శ్రీచరణిని ఎంపిక చేయలేదు. ఈ బాధ ఆమెని ఎంతోకాలం వేధించింది. కానీ అండర్-19లోనే ఆల్‌రౌండర్‌గా ఎంతో ప్రతిభ చూపించడంతో 2022 ఆంధ్ర సీనియర్ జట్టులో తనకి స్థానం లభించింది. ఆ తరువాత 2023 టీ 20 ఛాంపియన్‌షిప్, 2024 ప్రీమియర్ లీగ్‌తో తను దూసుకుపోయింది. పాల్గొన్న ప్రతి పోటీలో తను ఎంత ప్రతిభ చూపించిందంటే.. అత్యుత్తమ బౌలింగ్ గణాంకాల జాబితాలో తన ర్యాంకు 4. మొత్తం 12 మంది బౌలర్లలో ఈ స్థానం దక్కడం అంత ఆషామాషీ కాదు. కానీ పట్టుదల, కృషి ఉన్న శ్రీచరణి అది సునాయాసంగా సాధించింది.

క్రికెట్‌లో యువరాజ్, స్మృతి మంధాన, హర్మన్, జెమీమా అంటే తనకి ఎంతో అభిమానం. యువరాజ్ ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు కొట్టిన వీడియో అయితే ఎన్నిసార్లు చూసిందో లెక్కేలేదు. తన క్రికెట్ ప్రయాణం గురించి శ్రీచరణి ఇలా చెప్పింది.

'నేను బాల్యంలో ఎన్నో ఆటలు ఆడాను. ఖోఖో, కబడ్డీ, క్రికెట్ అన్నింటిలో రాణించాను. మామయ్య కారణంగానే క్రికెట్‌ని ఎంచుకున్నాను. అయితే ఎప్పుడూ దాన్ని వృత్తిగా స్వీకరిస్తానని అనుకోలేదు. అమ్మ నన్ను ఎంతో ప్రోత్సహించింది. నాకు స్పిన్ వేయడం చాలా ఇష్టం. ఒకసారి దాన్ని ప్రయత్నించి సక్సస్ అయ్యాను. అంతే ఇక వెనుదిరిగి చూడలేదు' అని తన అనుభవాల్ని ఆమె చెబుతుంది.

అథ్లెటిక్ నుండి క్రికెటర్‌గా మారతానని చెప్పినప్పుడు తండ్రి నుండి ఆమెకి వ్యతిరేకత ఎదురైంది. 'ఏడాదిపాటు ఆయన ఒప్పుకోలేద'ని శ్రీచరణి ఒకసారి చెప్పింది. 'మధ్యతరగతి కుటుంబ కష్టాలు నాకు తెలుసు. నాన్న ఒప్పుకోకపోవడానికి అవే కారణం. కానీ నా ఇష్టం చూసి నాన్న చివరికి ఒప్పుకున్నారు. నేను ఆటలో రాణించి, నాన్న కళ్లల్లో సంతోషం చూడాలని అనుకునేదాన్ని. క్రికెట్‌లో ఇంతలా రాణిస్తున్నానంటే అమ్మానాన్నల కృషి ఎంతో ఉంది' అని తన ఆర్థిక కష్టాల గురించి చెప్పే ఆమె, డబ్ల్యుపిఎల్ వేలంలో రూ.55 లక్షలకు తనని ఢిల్లీ ఇండియన్స్ కొనుగోలు చేసినప్పుడు ఆనందంతో నాన్న కన్నీళ్లు కార్చిన సందర్భాన్ని కూడా మర్చిపోలేదు.



తమ నివాస గృహంలో ఫైనల్ మ్యాచ్ వీక్షిస్తున్న శ్రీచరణి తల్లిదండ్రులు

'శ్రీచరణి వాళ్ల నాన్నవి కదా!' అంటున్నారు..



మా పాప చిన్నప్పుడు ప్లాస్టిక్ బ్యాటు పట్టుకుని క్రికెట్ నేర్చుకుంది. ఏదో చిన్నపిల్ల సరదాగా ఆడుతుంది అనుకునేవాడ్ని. కానీ అదే ఆటలో ఈ స్థాయికి వెళుతుందని ఊహించలేదు. అన్ని ఆటల్లో బాగానే ఉండేది. అయితే క్రికెట్‌కి వెళతానంటే ముందు అభ్యంతరం చెప్పాను. ఆర్థికంగా అది మాకు చాలా భారం. కానీ తను పట్టు విడవలేదు. తన ప్రయత్నంలో నా భార్య రేణుక ఎంతో సాయంగా నిలబడింది. తను ఇచ్చిన ప్రోత్సాహం వల్లే ఈరోజు శ్రీచరణి ఇంత ఎత్తుకు వెళ్లింది. కాబట్టి క్రెడిట్ అంతా నా భార్యకే దక్కుతుంది. ఇప్పుడు నేను ఎక్కడికి వెళ్లినా అందరూ నన్ను 'శ్రీచరణి వాళ్ల నాన్నవి కదా!' అంటుంటే చాలా గర్వంగా ఉంది.

చంద్రశేఖర్ రెడ్డి, శ్రీచరణి తండ్రి.

'చిన్న పిల్ల అంత దూరం వద్దు' అన్నారు..



భారత్ 'వరల్డ్ కప్' గెలిచినందుకు చాలా సంతోషంగా ఉంది. మేం గ్రౌండ్‌కి వెళ్లినప్పుడు అక్కడ అందరూ మమ్మల్ని చరణి వాళ్ల అమ్మానాయినా అంటుంటే ఎంత సంతోషంగా ఉండేదో.. మా పేర్లు తెలియకుండా, మా బిడ్డ పేరుతో మమ్మల్ని గుర్తుపట్టేవారు. చిన్నప్పుడు అకాడెమీకి పంపుతుంటే బంధువులు వద్దని చెప్పేవారు. 'చిన్నపిల్ల.. అసలే మంచికాలం కాదు. వద్దు అనేవారు' కానీ నేను మాత్రం ఒప్పుకునేదాన్ని కాదు. ఏం పర్వాలేదు. పిల్లకి క్రికెట్ అంటే చాలా ఇష్టం. దానికి ధైర్యం ఉంది. పంపిద్దాం' అని చెప్పేదాన్ని. ఇప్పుడు చరణి క్రికెట్‌లో బాగా ఆడుతుంటే వాళ్లే నా పాపని మెచ్చుకుంటున్నారు. కప్ గెలిచిందని, 'మీరు పిల్లని బాగా ప్రోత్సహించార'ని మమ్మల్ని కూడా ప్రశంసిస్తున్నారు.

రేణుక, శ్రీచరణి తల్లి.



చిరు సినిమాలో పోలీసాఫీసర్‌గా వెంకటేష్

కథానాయకుడు చిరంజీవి నటిస్తున్న సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు'. ఇందులో మరో కథానాయకుడు వెంకటేష్ కూడా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతోంది. ఇద్దరు సీనియర్ కథానాయకులు కలిసి నటిస్తున్న మల్టీస్టారర్ సినిమా కావటంతో అభిమానుల్లో ఆసక్తి బాగా పెరిగింది. హిట్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, పాజిటివ్ ఎనర్జీతో నిండిన కథలను చెప్పడంలో అనిల్‌రావిపూడి దిట్ట. పోలీస్ ఆఫీసర్ పాత్రలో వెంకటేష్ కనిపించనున్నారు. చిరంజీవి, వెంకటేష్ కలిసి నటించిన కొన్ని సన్నివేశాలు ఇప్పటికే చిత్రీకరణ పూర్తయ్యాయి. ఇద్దరు నటించిన ఓ పాటను కూడా ఇటీవల చిత్రీకరించారు. చిరంజీవి అటిట్యూడ్; వెంకటేష్ కూల్‌కామెడీ మరింతగా పండనుందనేది ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది.



నాని తల్లిగా సోనాలి కులకర్ణి

కథానాయకుడు నాని నటిస్తున్న 'ప్యారడైజ్' సినిమాలో బాలీవుడ్ నటి సోనాలి కులకర్ణి నటించబోతున్నారు. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ చిత్ర యూనిట్ ఓ పోస్టు పెట్టింది. దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. మోహన్‌బాబు కీలక పాత్రలో నటించారు. పూణేకు చెందిన సోనాలి కులకర్ణి తెలుగులో నటిస్తోన్న తొలి సినిమా ఇదే. మరాఠీ, హిందీ, గుజరాతీ, ఇంగ్లీష్, ఇటాలియన్ భాషల్లో పలు సినిమాలు చేసింది సోనాలి కులకర్ణి. ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. కిల్ యాక్టర్ రాఘవ ఈ సినిమాలో కనిపించబోతున్నాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందించారు.



22న 'ఆంధ్రా కింగ్ తాలూకా' విడుదల

రామ్ పోతినేని ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా' సినిమా ఈనెల 28న విడుదల కానుంది. 'మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేం మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. 'ఆర్‌ఎపిఒ22' పేరుతో మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను తెరకెక్కించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ నటుడు ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమాకు సంబంధించి నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మ్యూజిక్ కార్యక్రమాల్లో చంద్రబోస్ పాల్గొంటున్నారు. రామ్ అండ్ టీం చంద్రబోస్‌తో కలిసి దిగిన సెల్ఫీని షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది. రామ్ ఈ సినిమాలో ఆంధ్రా కింగ్ సూర్యకుమార్ అభిమానిగా కనిపించనున్నాడు. గ్లింప్స్‌లో సినిమా రిలీజ్ రోజు తన అభిమాన హీరో స్టైల్‌ను అనుకరిస్తూ థియేటర్‌లోకి ఎంట్రీ ఇచ్చిన రామ్ 'ఆంధ్రా కింగ్ ఫ్యాన్స్ తాలూకా' అంటూ యాభై టిక్కెట్లు అడగగానే.. మేనేజర్ ఇస్తాడు. దాంతో రామ్ ఫ్యాన్స్‌తో కలిసి సంబరాలు చేసుకుంటాడు. రావు రమేష్; మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వివేక్-మెర్విన్ టాలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు.

యువతకు సందేశాత్మకంగా 'ది గర్ల్‌ఫ్రెండ్ : దీక్షిత్‌శెట్టి

'దసరా మూవీ తర్వాత నాకు వచ్చిన అవకాశమిది. 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీ కోసం దర్శకుడు రాహుల్ రవీంద్రన్ నన్ను కలిశారు. రశ్మిక కథానాయిక. మూవీలో బాయ్‌ఫ్రెండ్ రోల్ కోసం అనుకుంటున్నామని చెప్పి స్క్రిప్ట్ పంపారు. దసరా మూవీకి చేసిన ఇంటర్వ్యూల్లో నన్ను చూసి రాహుల్ ఈ క్యారెక్టర్‌కు నేను బాగుంటానని గట్టిగా నమ్మారు. స్క్రిప్ట్ చదివాక నన్ను ఈ క్యారెక్టర్ కోసం ఎందుకు ఎంపిక చేశారో అర్థమైంది. నేను వివిధ భాషల్లో సినిమాలు చేస్తున్నాను. తెలుగుతో పాటు తమిళ, మలయాళంలో స్క్రిప్ట్స్ వింటుంటా. 'ది గర్ల్ ఫ్రెండ్' లాంటి స్క్రిప్ట్స్ చాలా అరుదుగా వస్తుంటాయి. అందుకే ఈ సినిమాను తప్పకుండా చేయాలని అనుకున్నా. విక్రమ్ క్యారెక్టర్‌కు న్యాయం చేశానని అనుకుంటున్నా. రశ్మిక భూమా అనే పాత్రలో కన్పిస్తారు. ఈ సినిమా యూత్ కోసమే కాదు. కుటుంబ కథా చిత్రంగా కూడా అందరికీ బాగా నచ్చుతుంది. నటుడిగా వైవిధ్యమైన పాత్రల్లో నటించాలని ఉంది. తెలుగులో మంచి అవకాశాలు వస్తున్నాయి. బాగా నటిస్తే తెలుగు ఆడియెన్స్ ఏ భాషలో నటుడినైనా ఆదరిస్తారు. నిర్మాతలు విద్య, ధీరజ్ చాలా మంచి సహకారాన్ని అందించారు. హేషమ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమా నా కెరీర్‌లోనే అత్యుత్తమ చిత్రంగా ఉంటుందని ఖచ్చితంగా చెప్పగలను' అని కథానాయకుడు దీక్షిత్‌శెట్టి చెప్పారు. రష్మిక మందన్నా, దీక్షిత్‌శెట్టి జంటగా నటించిన సినిమా 'ది గర్ల్‌ఫ్రెండ్'. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించాయి. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కిన ఈ సినిమా ఈ నెల ఏడోతేదీన హిందీతో పాటు తెలుగులోనూ విడుదల కానుంది. 14న, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేయటానికి చిత్ర యూనిట్ ఏర్పాట్లు చేసింది. ప్రచార కార్యక్రమంలో భాగంగా దీక్షిత్‌శెట్టి మీడియాతో పై విధంగా మాట్లాడారు.



మహిళా క్రికెటర్లపై కనకవర్షం

- **ఐసిసి రూ.39.80కోట్లు, బిసిసిఐ రూ.51కోట్లు నజరానా**
- **5న ఆటగాళ్లతో కలిసి రండి: ప్రధాని కార్యాలయం నుంచి బిసిసిఐకి ఆహ్వానం**



దుబాయ్: తొలిసారి వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళా క్రికెటర్లపై కనకవర్షం కురుస్తోంది. ముచ్చటగా మూడోసారి ఫైనల్‌కు చేరిన టీమిండియా.. విశ్వ విజేతగా నిలవడంతో క్రీడాభిమానులంతా సంబరాలు జరుపుకుంటుండగా.. ట్రోఫీ నెగ్గిన భారత మహిళా జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ట్రోఫీతో పాటు రూ.39.80కోట్లు నగదు బహుమతి అందజేసింది. ఇక భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) తొలిసారి ఐసిసి ట్రోఫీ ముద్దాడిన భారతజట్టుకు రూ.51కోట్ల నగదు బహుమతి సోమవారం ప్రకటించింది. ఈ క్రమంలోనే భారతజట్టు తరపున ఆడిన క్రికెటర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నజరానాలు ప్రకటిస్తున్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికా మహిళలను ఓడించి తొలిసారి టైటిల్ నెగ్గిన హర్మన్‌ప్రీత్ సేనకు రికార్డు స్థాయిలో 44లక్షల 80వేలడాలర్లు (రూ. 39కోట్ల 80 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది. రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా జట్టుకు 22 లక్షల 40 వేల డాలర్లు (రూ. 19కోట్ల 90 లక్షలు) లభించాయి. సెమీఫైనల్లో ఓడిన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లకు ఒక్కో జట్టుకు 11 లక్షల 20 వేల డాలర్ల (రూ. 9 కోట్ల 94 లక్షలు) చొప్పున అందుకున్నాయి. ఐదు, ఆరు స్థానాల్లో నిలిచిన శ్రీలంక, న్యూజిలాండ్ జట్లకు 7 లక్షల డాలర్ల (రూ. 6కోట్ల 21లక్షలు) చొప్పున... ఏడు, ఎనిమిదో స్థానాల్లో నిలిచిన బంగ్లాదేశ్, పాకిస్తాన్ జట్లకు 2 లక్షల 80 వేల డాలర్ల (రూ. 2కోట్ల 48 లక్షలు) చొప్పున లభించాయి. అంతేకాకుండా ఈ మెగా ఈవెంట్‌లో ఆడిన ఎనిమిది జట్లకు గ్యారంటీ మనీ కింద 2 లక్షల 50 వేల డాలర్ల (రూ. 2 కోట్ల 22 లక్షలు) చొప్పున దక్కాయి. లీగ్ దశలో సాధించిన ఒక్కో విజయానికి ఆయా జట్లకు 34 వేల 314 డాలర్ల (రూ. 30లక్షల 47 వేలు) చొప్పున దక్కాయి.

బిసిసిఐకి ఆహ్వానం

తొలిసారి మహిళల వన్డే ప్రపంచకప్‌ను నెగ్గిన భారత మహిళా క్రికెటర్లకు భారత ప్రధాని నరేంద్ర మోడీ కార్యాలయం నుంచి ఆహ్వానం లభించింది. సోమవారం(5న) భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) ఛాంపియన్స్ జట్టుతో కలిసి రావాల్సిందిగా అందులో రాసి ఉంది. దీంతో ముంబయిలోనే ఉన్న టీమిండియా ఆటగాళ్లు, సహాయ సిబ్బంది ప్రధాని నరేంద్ర మోడీని కలిసిన అనంతరం తమ తమ రాష్ట్రాలకు బయల్దేరి వెళ్లనున్నారు.

300 శాతం పెరిగిన ప్రైజ్‌మనీ....

వన్డే ప్రపంచకప్ విజేతకు అందజేసే ప్రైజ్‌మనీ ఈసారి ఏకంగా 300 శాతం పెరిగడం గమనార్హం. ఐసిసి అధ్యక్షుడు జై షా ఈ పెంపుదల చేసినట్లు బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు.

బిసిసిఐ రూ.51కోట్లు నజరానా ....

రెండుసార్లు(2005, 2017)లలో ఫైనల్‌కు చేరినా.. రన్నరప్‌కే పరిమితమైన టీమిండియా.. ముచ్చటగా మూడోసారి ఫైనల్‌కు చేరి విశ్వవిజేతగా నిలిచింది. దీంతో బిసిసిఐ భారీ నజరానా ప్రకటించింది. టీమిండియాకు రూ.51 కోట్లు బహుమతిగా ఇవ్వనున్నట్లు బిసిసిఐ కార్యదర్శి సైకియా సోమవారం ప్రకటించారు. ఇది ఆటగాళ్లు, కోచ్‌లు, సహాయ సిబ్బందితోపాటు, సెలెక్షన్ కమిటీ సభ్యులందరూ పంచుకోవాలని తెలిపారు. దీంతో కోచ్, ఆటగాళ్లు ఒక్కొక్కరు కనీసం రూ.2.5 నుంచి రూ.3కోట్లు, సహాయ కోచ్‌లు, అధికారులు రూ.25 నుంచి రూ.30లక్షల వరకు అందుకోనున్నారు.

వరల్డ్ కప్ జట్టులో నలుగురికి చోటు

ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ సంగ్రామం ముగిసింది. ఈ టోర్నీలో భారత మహిళల జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. 13వ సీజన్‌లో అద్భుత ప్రదర్శన చేసిన నలుగురు భారత క్రికెటర్లు 'వరల్డ్ కప్ టీమ్ ఆఫ్ ది టోర్నీ'లో చోటు దక్కించుకున్నారు. క్రీడాభిమానులను అలరించిన వన్డే ప్రపంచకప్ ముగియడంతో క్రికెట్ వెబ్‌సైట్(ఇఎస్‌పిఎన్ క్రిక్‌ఇన్ఫో)జట్టును ప్రకటించింది. ఇందులో భారత్ నుంచి నలుగురు, రన్నరప్ దక్షిణాఫ్రికా జట్టు నుంచి ముగ్గురు ఎంపికవ్వగా.. ఆస్ట్రేలియా జట్టులోని ముగ్గురు, ఇంగ్లండ్ నుంచి ఒకరికి చోటు లభించింది. స్మృతి మంధాన ఓపెనర్‌గా, మిడిలార్డర్ బ్యాటర్‌గా జెమీమా రోడ్రిగ్స్, వికెట్ కీపర్‌గా రీచా ఘోష్.. స్పిన్ ఆల్‌రౌండర్‌గా దీప్తి శర్మలు ఎంపికయ్యారు.

వన్డే ఉత్తమ జట్టు: వొల్వార్డ్(కెప్టెన్), మంధాన, రోడ్రిగ్స్, మరిజానే కాప్, సథర్లాండ్, గార్డ్‌నర్, రీచా(వికెట్ కీపర్), డీక్లెర్క్, దీప్తి శర్మ, కింగ్, ఎకిల్‌స్టోన్. 12వ ప్లేయర్: సోఫీ డెవినె.

మెరిసిన ఆంధ్ర బౌలర్లు

- **ఒడిషాపై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత**
- **రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్**



భువనేశ్వర్: రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-ఎలో ఆంధ్ర బౌలర్లు సాయితేజ, సౌరభ్ కుమార్, త్రిపరణ విజయ్ మూడేసి వికెట్లతో రాణించారు. దీంతో ఒడిషా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 151 పరుగులకే ఆలౌటైంది. సందీప్(58), చౌదరి(48) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో ఆంధ్ర జట్టుకు 324పరుగుల తొలి ఇన్నింగ్స్ లభించింది. అనంతరం ఫాలోఆన్ ఆడుతూ ఒడిషా జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు నష్టపోయి 190 పరుగులు చేసింది. క్రీజ్‌లో ఓపెనర్ చౌదరి(79), గోవింద్(4) ఉన్నారు. సమాల్(36), పట్నాయక్(63) పెవీలియన్‌కు చేరారు. ఆ జట్టు ఇంకా 134పరుగుల వెనుకబడి ఉంది.

హైదరాబాద్ లక్ష్యం 344 పరుగులు

రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-డిలో హైదరాబాద్ జట్టు 344పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో హిమాచల్ ప్రదేశ్ జట్టు 303 పరుగులకు ఆలౌటైంది. దీంతో హైదరాబాద్ జట్టు మూడోరోజు ఆ ముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది. సోమవారం హిమాచల్ ప్రదేశ్ బ్యాటర్లు వశిష్ట్(101), దగర్(52) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించగా.. ముకుల్ నేగి(0), విపిన్ శర్మ(8), వైభవ్ అరోరా(8) నిరాశపరిచారు. హైదరాబాద్ బౌలర్లు మిలింద్ శర్మకు మూడు, పున్నయ్యకు రెండు వికెట్లు దక్కాయి. చివరిరోజైన మంగళవారం హైదరా బాద్ జట్టు మరో 336పరుగుల లక్ష్యాన్ని ఛేధించాల్సి ఉంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68